ESTD : 1999

# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

స్టేట్ విజన్

STATE VISION

బుధవారం 13-05-2026 పేజీలు : 16




## అక్రమ మట్టి మాఫియా దందా..?

● తవ్వకాలకు అనుమతి ఎవరు ఇచ్చారు..?

●ఎన్‌హెచ్--980పీ పక్కనే భారీ గుంతలు.. అధికారులు మాత్రం మౌనం..?



9 పేజీలో...

మొక్కజొన్న సొప్పకు పెట్టిన నిప్పులో ప్రమాదవశాత్తు పడి

## వ్యక్తి మృతి



నిర్మల్. మే 12. ( విజన్ ఆంధ్ర ) : నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం కనకాపూర్ గ్రామానికి చెందిన మంద గంగన్న 56 స.లు ఆనే రైతు ఈరోజు ఉదయం 10:30 గం. లకు తన చేనులో వృధాగా పడి ఉన్న మొక్క కర్రలకు నిప్పు పెట్టగా అది పక్కకు ఉన్న వరి పంటల వైపు మంటలు వ్యాపించడంతో ఆర్పి వేసే క్రమంలో ప్రమాదవశాత్తు తన శరీరానికి నిప్పు అంటుకొని అక్కడే మరణించాడు మృతుని భార్య ఫిర్యాదు మేరకు లక్ష్మణ్ చందా ఎస్సై శ్రావణి గారు సంఘటన స్థలానికి చేరుకొని మృతుని యొక్క శవం ను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మండుతున్న చికెన్ ధరలు



11 పేజీలో...

## కొనుగోళ్లపై నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై

# చర్యలు తప్పవు

➜ రైతులకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా చూడాలి,

➜ కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో ప్రత్యక్షంగా పర్యవేక్షించాలి,

➜ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మే 12, (విజన్ ఆంధ్ర ప్రతినిధి): మిషన్ మోడ్‌లో పనిచేసి రాష్ట్రంలో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్రంలో ధాన్యం సేకరణ ప్రక్రియ, పురోగతిపై వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ జిల్లాల్లో ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో తలెత్తిన ఇబ్బందులు, సమస్యలపై కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని అధికారులకు స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి కొనుగోళ్ల తీరును పరిశీలించాలని సూచించారు. గన్ని బ్యాగులు, హమాలీల కొరత లేకుండా చూసుకోవడంతోపాటు కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోడౌన్స్ కు తరలించాలని ఆదేశించారు. ధాన్యం లోడ్ తరలించేందుకు ఒప్పందం మేరకు సరిపడా లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించొద్దని, అవసరమైతే అలాంటి వారిపై క్రిమినల్ కేసులకూ వెనకాడొద్దన్నారు.

7 పేజీలో...



## నీట్ రద్దు ఎన్.టి.ఎ వైఫల్యంకు నిదర్శనం..!

### విద్యార్థుల జీవితాలతో ఆటలా,

తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్, రాజనర్సింహ ఆగ్రహం, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మే 12, (విజన్ ఆంధ్ర ప్రతినిధి): నీట్ పరీక్ష రద్దు కావడం అత్యంత దురదృష్టకరం అంటూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో సుమారు 70 వేల మంది, దేశవ్యాప్తంగా సుమారు 22 లక్షల మందికిపైగా విద్యార్థులు ఈసారి నీట్ రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. వారి భవిష్యత్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఇబ్బందుల్లోకి నెట్టింది అని అన్నారు. నీట్ నిర్వాహణలో ఎన్‌టీఏ పూర్తిగా విఫలమైంది అని గతంలో జరిగిన ఘటనల నుంచి నేర్చుకుని, పకడ్బందీగా పరీక్ష నిర్వహించకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని అనడానికి నేడు నీట్ పరీక్ష రద్దు అద్దం పడుతుందని చెప్పారు. ఎన్‌టీఏ నిర్లక్ష్యం 22 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌కు ప్రమాదకరంగా పరిణమించిందన్నారు. పరీక్ష రద్దు కావడంతో ఎంతో మంది విద్యార్థులు,వారి తల్లిదండ్రులు మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇకనైనా సరియైన రీతిలో స్పందించి.. ఇంత పెద్ద తప్పిదానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

## నీట్ పరీక్ష నిర్వహణలో బిజేపి ప్రభుత్వం పూర్తిగా విఫలం

--తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి.

--ప్రశ్నపత్రాల లీకేజీలతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన.

--నీట్ పేపర్ లీకేజీకి పూర్తి బాధ్యత వహించి కేంద్ర ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలి

10 పేజీలో...

# మంత్రి పదవి అడ్డుపెట్టుకొని కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్న బండి సంజయ్

**- బండి భగీరథ్ ని వెంటనే అరెస్టు చేయాలి**

**- బాలిక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలి**



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర మే 12 : రాష్ట్రంలో సంచలనం రేపుతున్న బండి సంజయ్ కుమారుడి బాగోతం బట్ట బయలు కావడంతో కేంద్ర మంత్రి బండి సంజయ్ కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నాడని మంత్రి పదవిలో కొనసాగే అర్హత బండి సంజయ్ కోల్పోయాడని వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అన్వర్ పాషా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తండ్రి కేంద్ర మంత్రి పదవిని అడ్డు పెట్టుకొని కొడుకు బండి భగీరథ్ తన అరాచకాన్ని సృష్టిస్తున్నాడని, అభం శుభం తెలవని మైనర్ బాలికపై కిరాతకంగా తన వక్ర బుద్ధిని ప్రదర్శించడం చాలా సిగ్గుచేటని ఇలాంటి వారిని వెంటనే అరెస్టు చేయాలని,బాలిక కుటుంబానికి సత్వరమే న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం బండి సంజయ్ కుటుంబానికి అండగా ఉండే ప్రయత్నం చేస్తుందని, ఆరోపించారు.మంత్రులకు ఓ న్యాయం సామాన్యులకు ఓ న్యాయమా అని ప్రశ్నించారు. అందరికీ ఒకే విధమైన శిక్ష పడే విధంగా బండి భగీరథ్ ను వెంటనే అరెస్టు చేసి కఠిన శిక్ష విధించాలని ప్రభుత్వాన్ని కోరారు.రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతో నేడు రాష్ట్రంలో అరాచకాలు పెరిగాయని నాడు బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రజలకు ఏ హాని తలెత్తకుండా మెరుగైన ప్రజాసేవ అందించేందుకు కేసిఆర్ ప్రభుత్వం కృషి చేసిందని ఆయన గుర్తు చేశారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం వైఫల్యంతోనే రాష్ట్రంలో పూర్తిగా అరాచకాలు జరుగుతున్నాయని అన్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బాధిత బాలిక కుటుంబాన్ని వెంటనే ఆదుకొని దోషిని వెంటనే శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ గాదపాక రవీందర్, గడిపె సతీష్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వంగ వెంకట్రామిరెడ్డి,అలుమల్ల ప్రభాకర్ రెడ్డి,బూర వెంకన్న గౌడ్,పూదరి రవీందర్ గౌడ్,బోజు రవీందర్, చిత్తారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి సందర్భంగా శివాజీ నగర్ లో ప్రత్యేక పూజలు



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర మే 12 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో హనుమాన్ జయంతి సందర్భంగా శివాజీ నగర్ లోని హనుమాన్ దేవస్థానంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత వెంకన్న ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేక పూజ చందన పూజ ఆకు పూజ వడమాల పూజ మాన్యసూక్త హోమము గణపతి నవగ్రహ హోమములు హనుమాన్ చాలీస్ పారాయనము పూజలు నిర్వహించడం జరిగిందన్నారు.అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.పట్టణ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని దేవున్ని వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆకుల వెంకన్న, మాజీ సింగిల్ విండో చైర్మన్ బోలిశెట్టి శివయ్య,కౌన్సిలర్ గోపగోని శోభన్,ఐలేని శంకర్ రెడ్డి పచ్చిమట్ల రవీందర్ కొమురవెల్లి రవీందర్ ఐలేని మాధవరెడ్డి దేవస్థానం పూజారి రామక పవన్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

## నేడు మర్పల్లి మండలంలో శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పర్యటన

**- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మల సురేష్ యాదవ్ వెల్లడి**



మర్పల్లి, మే 12 (విజన్ ఆంధ్ర):తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ గారు నేడు బుధవారం, మర్పల్లి మండలంలో విస్తృతంగా పర్యటించనున్నారు. ఈ మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుమ్మల సురేష్ యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో పర్యటన వివరాలను వెల్లడించారు. ఉదయం 9 గంటలకు హైదరాబాద్ నుండి బయలుదేరి ముందుగా మండలంలోని మోగలిగుండ్ల గ్రామంలోని వార్డు మెంబర్ చేర్యాల జనార్ధన్ గారి భార్య మొగలమ్మ గారి మృతి పట్ల వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శిస్తారు.కోట మర్పల్లి గ్రామంలోని శ్రీ మల్లన్న స్వామి ఆలయ పునర్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు.

మర్పల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ళ గృహ ప్రవేశ మహోత్సవంలో పాల్గొంటారు. అనంతరం ఇటీవల మరణించిన చంద్రయ్య స్వామి గారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు.పర్యటన చివరగా మర్పల్లి ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమంలో లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నారు.ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, వివిధ విభాగాల అధ్యక్షులు, అనుబంధ సంఘాల సభ్యులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని తుమ్మల సురేష్ యాదవ్ కోరారు.

## బండి సాయి భగీరథను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలి

**- ఎల్ హెచ్ పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీర సమ్మయ్య నాయక్**

**- సాధారణ ప్రజలకు ఓ నీతి కేంద్ర మంత్రి కొడుక్కు మరో నీతా..?**



మల్హర్, మే12 విజన్ ఆంధ్ర : సాధారణ ప్రజలకు ఒక నీతి, కేంద్ర మంత్రి కుమారుడికి మరో నీతా? అని లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్ హెచ్ పిఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్,బిసి, ఎస్సీ, ఎస్టీ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా కో-కన్వీనర్ అజ్మీర సమ్మయ్య నాయక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథపై పోక్సో కేసు నమోదైనప్పటికీ, నేటికీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా సమ్మయ్య నాయక్ మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని విమర్శించారు. ఒక మైనర్ బాలిక న్యాయం కోసం మూడు నెలలుగా పోరాడాల్సి రావడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. బాధితురాలు మరియు ఆమె కుటుంబాన్ని నేరస్థులు వేధించడం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు. "భేటీ బచావో" అంటూ పెద్ద పెద్ద మాటలు చెప్పే బీజేపీ నాయకత్వం, తమ సొంత కుటుంబ సభ్యులపై ఆరోపణలు వచ్చినప్పుడు ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు. అన్ని ఆధారాలతో మైనర్ బాలిక ఫిర్యాదు చేసినా, అధికారులు వెంటనే స్పందించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందని అన్నారు. రాజకీయ పలుకుబడితో కేసును నీరుగార్చాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. తక్షణమే సాయి భగీరథను అరెస్టు చేసి బాధితురాలికి న్యాయం చేయాలని, లేనిపక్షంలో లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని అజ్మీర సమ్మయ్య నాయక్ హెచ్చరించారు.

## గుడుంబా స్థావరాల పై మెరుపు దాడులు

**- భారీగా నాటుసారా, బెల్లం పానకం ధ్వంసం**

**- కొయ్యూరు ఎస్ఐ 2 రజన్ కుమార్**

మల్హర్, మే 12 విజన్ ఆంధ్ర : మండలంలోని అడువాలపల్లి గ్రామంలో గుడుంబా స్థావరాలపై కొయ్యూరు పోలీసులు మంగళవారం మెరుపు దాడులు నిర్వహించారు. కొయ్యూరు ఎస్ఐ-2 రాజన్ కుమార్ ఆధ్వర్యంలో అందిన ముందస్తు సమాచారం మేరకు ఈ దాడులు చేపట్టారు.ఈ తనిఖీల్లో భాగంగా సుమారు 35 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకోగా, సారా తయారీ కోసం సిద్ధంగా ఉంచిన 120 లీటర్ల బెల్లం పానకాన్ని పోలీసులు అక్కడికక్కడే ధ్వంసం చేశారు. గ్రామాల్లో అక్రమంగా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎస్ఐతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## శ్రీ కార్యసిద్ధి హనుమంతునికి విశేష తిరుమంజన సేవలు

భువనగిరి మే12(విజన్ ఆంధ్ర):భక్తకోటి ఆరాధ్యదైవమైన శ్రీ ఆంజనేయస్వామివారి జయంతి సందర్భంగా భూలోక వైకుంఠంగా ప్రసిద్ధి చెందిన స్వర్ణగిరి క్షేత్రంలో శ్రీ కార్యసిద్ధి హనుమజ్జయంతి మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించబడిన 40 అడుగుల ఎత్తైన శ్రీ కార్యసిద్ధి హనుమంతుని విగ్రహానికి అర్చక వేదపండితులు ఆగమోక్తంగా విశేష పూజలు, తిరుమంజన కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ, వేదఘోష మధ్య ప్రారంభమైన ఈ మహోత్సవంలో ముందుగా స్వామివారికి పుణ్యాహవాచనం, సంకల్పం నిర్వహించి అనంతరం సుగంధ ద్రవ్యాలతో మహా అభిషేకం చేశారు. చందనం, కర్పూరం, కుంకుమ, పసుపు, తేనె, పాలు, పెరుగు, కొబ్బరినీరు తదితర పవిత్ర ద్రవ్యాలతో స్వామివారికి విశేష తిరుమంజనం నిర్వహించారు. తమలపాకులతో ప్రత్యేక అభిషేకం చేయగా, ఆ దివ్య దర్శనం భక్తులను ఆధ్యాత్మిక పరవశంలో ముంచెత్తింది. ఈ సందర్భంగా వేల సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీర్వాద వచనములను అందుకున్నారు.

# శ్రీ కార్యసిద్ధి హనుమంతునికి విశేష తిరుమంజన సేవలు

భువనగిరి మే12(విజన్ ఆంధ్ర):భక్తకోటి ఆరాధ్యదైవమైన శ్రీ ఆంజనేయస్వామివారి జయంతి సందర్భంగా భూలోక వైకుంఠంగా ప్రసిద్ధి చెందిన స్వర్ణగిరి క్షేత్రంలో శ్రీ కార్యసిద్ధి హనుమజ్జయంతి మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించబడిన 40 అడుగుల ఎత్తైన శ్రీ కార్యసిద్ధి హనుమంతుని విగ్రహానికి అర్చక వేదపండితులు ఆగమోక్తంగా విశేష పూజలు, తిరుమంజన కార్యక్రమాలు నిర్వహించారు.

మంగళవాయిద్యాల నడుమ, వేదఘోషల మధ్య ప్రారంభమైన ఈ మహోత్సవంలో ముందుగా స్వామివారికి పుణ్యాహవాచనం, సంకల్పం నిర్వహించి అనంతరం సుగంధ ద్రవ్యాలతో మహా అభిషేకం చేశారు. చందనం, కర్పూరం, కుంకుమ, పసుపు, తేనె, పాలు, పెరుగు, కొబ్బరినీరు తదితర పవిత్ర ద్రవ్యాలతో స్వామివారికి విశేష తిరుమంజనం నిర్వహించారు. తమలపాకులతో ప్రత్యేక అభిషేకం చేయగా, ఆ దివ్య దర్శనం భక్తులను ఆధ్యాత్మిక పరవశంలో ముంచెత్తింది. ఈ సందర్భంగా వేల సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీర్వాద వచనములను అందుకున్నారు.

# రైతులు దళారులను నమ్మి మోసపోరాదు



కుల్కచర్ల, మే 12(విజన్ ఆంధ్ర): రైతులు దళారులను నమ్మి మోసపోరాదని అంతారం సర్పంచి పృథ్వీరాజ్ గౌడ్ తెలిపారు. కుల్కచర్ల మండలం అంతారం గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సర్పంచి మాట్లాడుతూ... ప్రభుత్వం రైతులకు అందుబాటులో ఉండే విధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. వడ్లకు మద్దతు ధర రూ.2389 అదే విధంగా సన్న రకం వడ్లకు రూ.500 అదనంగా బోనస్ అందించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో చెరువు ముందలి తండా సర్పంచి రవీందర్ నాయక్, కుల్కచర్ల మాజీ ఎంపీపీ అంజిలయ్య గౌడ్, పంచాయతీ కార్యదర్శి ఎల్లమ్మ, నాయకులు జలీల్, తదితరులు పాల్గొన్నారు.

# యోగా ఆసనాలతో ఆరోగ్య చైతన్యం

## - ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాలు



బెల్లంపల్లి మే 12 విజన్ ఆంధ్ర :బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో మంగళవారం యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు వారం రోజులపాటు విద్యా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కళాశాల వరండాలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తో పాటు బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు వివిధ యోగాసనాలు వేశారు. యోగా ద్వారా ఆరోగ్యం పదిలంగా ఉంటుందని, ప్రతిరోజూ ప్రాణాయామం వంటి వ్యాయామాలు చేయాలని సూచించారు. అనంతరం డిగ్రీ విద్యార్థులకు పీజీ ఎంట్రన్స్ పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు తమకు ఆసక్తి, పట్టు ఉన్న సబ్జెక్టులను ఎంపిక చేసుకొని పీజీ చదువులు కొనసాగించాలని అధ్యాపకులు సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మేడ తిరుపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, సూపరింటెండెంట్, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి ఉత్సవాలు

## - శ్రీరామ్ జయరాం ఆంజనేయుని నామస్మరణతో మార్మోగిన హనుమాన్ ఆలయం

## - కమలాపురం లో ఘనంగా హనుమాన్ దీక్ష ఇరుముడి కార్యక్రమం



మంగపేట మే12 (విజన్ ఆంధ్ర) రిపోర్టర్ మంగపేట మండలం కమలాపురం గ్రామంలో శ్రీ భక్తఆంజనేయ దేవాలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలను కమలాపురం గ్రామానికి చెందిన కటికనేని ప్రఫుల్ రావు ఆధ్వర్యంలో పంచామృత అభిషేకం, సింధూర లేపనం, హనుమాన్ హోమం పూర్ణహుతి ఘనంగానిర్వహిచారు. అనంతరం ఆంజనేయస్వామి దీక్ష పరుల ఇరుముడి ధారణ కార్యక్రమం
శ్రీ భక్తంజనేయ అర్చకులు ఈశ్వర్ చందుశర్మ 41 రోజు, 21, 11 రోజుల పాటు కఠోర దీక్షలను చేపట్టిన వారికి అంజన్నస్వామి మాలధారులకు మంత్రోచ్ఛారణలతో ఇరుముడి కార్యక్రమాన్ని చేపట్టగా కుటుంబ సభ్యులు ఇరుముడి బియ్యం, సమర్పించారు. స్వాములు ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి భద్రాచలం సీతారాముల దర్శనానికి బయలుదేరారు. అనంతరం కటికనేని ప్రఫుల్ స్వామి, నిర్వహించిన మహాఅన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు ఈ అన్నప్రసాద వితరణ లో సుమారు ఎనిమిది వందల మంది భక్తులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు . ఈ కార్యక్రమంలో గురుస్వాములు లింగంపల్లి శ్రీనివాస్ రావు, యాస నాగేందర్ రెడ్డి, కటికనేని ప్రఫుల్ రావు, శ్రీ రాం అశోక్, లక్ష్మణ్, చందు, తాలూకా సంపత్ తోపాటు 50 మంది స్వాములు పాల్గొన్నారు.

# వైభవంగా రేణుక ఎల్లమ్మ కళ్యాణం..

కుకునూరుపల్లి, మే 12,విజన్ ఆంధ్ర : మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పురోహితులు శ్రీ రేణుక ఎల్లమ్మ – జమదగ్ని మహర్షుల కళ్యాణాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. అంతకు ముందు ఎదుర్కోలు కార్యక్రమం, వేద పండితులు చే యాగం నిర్వహించారు. భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమం లో ఉమ్మడి మెదక్ డీసీసీబి బ్యాంకు చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, స్థానిక సర్పంచ్ మల్లం కనుకవ్వ ఐలయ్య, ముద్దాపూర్ సర్పంచ్ తూం శ్రీకాంత్ రెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ మాజీ సభ్యులు సద్గుణ రవీందర్, మాజీ సర్పంచ్ లు కాసం నవీన్, పోల్కంపల్లి జయంతి నరేందర్, పాక్స్ వైస్ చైర్మన్ పిష్క అమరేందర్, మాజీ ఎంపిటిసీలు ఇండ్ల కనకయ్య, భూరమైన భూములు గౌడ్ ,గౌడ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కోన సత్యనారాయణ గుప్తా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య రంగంలో సేవలందించే నర్సులకు ఘన సన్మానం

మధిర,మ12(విజన్ ఆంధ్ర )వైద్య రంగంలో నర్సుల సహకారాన్ని గుర్తించే లక్ష్యంతో ప్రపంచవ్యాప్తంగ ఏటా మే 12న అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని కలిసి ప్రజల ఆరోగ్యాన్ని రక్షించడంలో వారు చేస్తోన్న కృషి, అన్ని సమయాల్లో రోగికి తోడుగా ఉంటూ జబ్బును నయం చేయడంలో వారి పాత్రపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

దీనిలో భాగంగా మంగళవారం స్థానిక టీవీఎం హైస్కూల్ నందు కోన సత్య నారాయణ గుప్తా ఫౌండేషన్ అధ్యక్ష, సెక్రటరీ లు కోన నర్సింహా రావు, లక్ష్మి సావిత్రి ఆధ్వర్యంలో లో అంతర్జాతీయ నర్సింగ్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించినారు. ఈ సందర్భంగా మండలం పరిధి లోని పీహెచ్ సీ దెందుకురు ఆరోగ్య సిబ్బంది మరియు వివిధ సబ్ సెంటర్స్ లో పని చేసే నర్సింగ్ ఆఫీసర్స్కు ఇతర వైద్య సిబ్బంది కీ ప్రముఖల చేతులు మీద గా దుశాలువ మెమంటో తో సత్కారించారు. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణలో నర్సులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయక రోగులకు సేవలను అందిస్తారన్నారు. మనకు ఏ ఆరోగ్య సమస్య వచ్చినా ఆసుపత్రికి వెళ్ళినపుడు డాక్టర్ కన్నా ముందు వచ్చి మనకు సహాయం చేసేది నర్సులే. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ రాసి ఇచ్చాక మనల్ని కంటికిరెప్పలా కాపాడి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా అయ్యే వరకు సేవలు చేసేది కూడా నర్సులే. కోవిడ్ -19 మహమ్మారి సమయంలో నర్సులు పోషించిన పాత్ర, అందించిన సేవలు మన అందరికి తెలిసిన విషయమే. కాబట్టి ఇలాంటి సందర్భాల్లో వారిని సత్కరించడం సన్మానించడం మన విధి అని అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపులో సీనియర్ సిటిజన్లకు బీపీ షుగర్ టెస్టులు నిర్వహించి కావలసిన మందులు అందజేశారు ఈ కార్యక్రమం లో డాక్టర్ పృథ్వి రాజ్ నాయక్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీస్ ర్ వి వెంకటేశ్వర్లు టీవీఎం వాకింగ్ క్లబ్ కమిటీ ప్రసిడెంట్ లింగంపల్లి వెంకాయమ్మ విశ్వ నాథం, నర్సింగ్ సిబ్బంది సృజన అరుణ, వి విజయ్ కుమారి వి భారతి, పిపియూ యూనిట్ సిబ్బంది తోట పద్మావతి పంతంగి సంధ్య, జె విజయ్ లక్ష్మి కే రాజేశ్వరి విశ్రాంతి ఉద్యోగులు సుదర్శన్ మరియు కోన సుబ్బారావుకుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



కుల్కచర్ల, మే 12 (విజన్ ఆంధ్ర): గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కుల్కచర్ల గ్రామ సర్పంచి అంజిలయ్య, ఉప సర్పంచి విజయ్ కుమార్ తెలిపారు. మండల కేంద్రమైన కుల్కచర్ల అముదాల గడ్డ కాలనీలో నూతన బోరు మోటార్‌ను ఏర్పాటు చేయించి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ...వేసవి దృష్ట్యా గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అన్ని విధాలుగా ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేలా చూస్తున్నామని చెప్పారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. గ్రామంలో అందరి సహకారంతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని వారు తెలియజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు వినోద్ కుమార్, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి...

### శ్రీ మారుతి స్వామివారికి వెండి ముఖం సమర్పణ..



బోధన్, మే 12 (విజన్ ఆంధ్ర) : బోధన్ పట్టణంలోని శ్రీ మారుతి మందిరంలో హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రాధికా ప్రవీణ్ మహారాజ్ దంపతుల కుమారులు శశాంక్ సాయి, దత్త సాయి లు స్వామివారిపై అపార భక్తిని చాటుతూ స్వామివారికి 400 గ్రాముల వెండితో తయారు చేసిన ప్రత్యేక వెండి ముఖాన్ని సమర్పించారు.
సుమారు 1 లక్ష 25 వేల విలువైన ఈ వెండి ముఖాన్ని ఆలయ ఈవో నాయకం రాములు, పిట్ల కృష్ణ మహారాజ్ ల ఆధ్వర్యంలో స్వామివారికి భక్తిపూర్వకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. హనుమాన్ జయంతి సందర్భంగా జరిగిన ఈ సేవా కార్యక్రమం ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పింది. భక్తులందరూ జై శ్రీరామ్ జై హనుమాన్ నినాదాలతో ఆలయాన్ని మార్మోగించారు. ఈ సందర్భంగా ఆలయానికి పెద్ద ఎత్తున విచ్చేసిన భక్తులకు అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగ, కృత్రిమ మేధా పట్ల అవగాహన

హుస్నాబాద్ విజన్ ఆంధ్ర మే 12 : ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు రెండవ రోజు మంగళవారం రోజున ధ్యానం, యోగా అభ్యసనం మరియు కృత్రిమ మేధా- వాటి ఉపయోగాలు అనే అంశంపై కార్యాశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా యోగ ప్రాచీన భారతీయ వైద్య విధానంలో భాగమని, శారీరక ఆరోగ్యానికి మరియు మానసిక ప్రశాంతతకు యోగ ఉపయోగపడుతుందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి తెలిపారు. యోగాసనాలను దినచర్యలో భాగంగా చేసుకోవడం ద్వారా అనేక శారీరక మరియు మానసిక రుగ్మతల నుంచి విముక్తి పొందవచ్చునని విద్యార్థులకు పిలుపునిచ్చారు. యోగా గురువు డాక్టర్ వి. అనిల్ కుమార్ సుదర్శన క్రియ, ప్రాణాయామం మరియు యోగాసనంల వల్ల కలిగే లాభాలను వివరిస్తూ ఆరోగ్యాభిలాషులచే యోగాసనాలను ధ్యాన ప్రక్రియలను చేయించారు. శ్వాస పైన ధ్యాస పెట్టడం ద్వారా, క్రమ రీతిలో శ్వాసను తీసుకోవడం ద్వారా మనిషి యొక్క ఆయుర్దాయం పెరుగుతుందన్నారు.
ఉరుకుల పరుగుల జీవితం, జీవనశైలిలో మార్పులు, కంప్యూటర్ మరియు సెల్ ఫోన్ వినియోగం వలన విద్యార్థులు మానసిక ప్రశాంతతను కోల్పోయి పలు అంశాల పట్ల ధ్యాస మరియు ఏకాగ్రతను నిలపలేకపోతున్నారని తెలుపుతూ ఈ సమస్యల నుండి బయటపడడానికి యోగ బాగా ఉపకరిస్తుందని వివరించారు. విద్యార్థులు అధ్యాపకులు యోగా మరియు ధ్యాన ప్రక్రియలను



విద్యార్థులు కృత్రిమ మేధా మరియు దాని ఉపయోగాలు అనే అంశంపై ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిద్ధిపేట స్వయం ప్రతిపత్తి వారి సౌజన్యంతో కార్యశాలను నిర్వహించారు. ఈ కార్యశాల ద్వారా చాట్ జిపిటి, జెమిని, క్లాడ్ మొదలవు కృత్రిమ మేధను వివరించే అప్లికేషన్ల గురించి సవివరంగా తెలుసుకోవడం జరిగిందన్నారు. అలాగే కృత్రిమ మేధ ద్వారా అభ్యసన ప్రక్రియలను, పాఠ్యప్రణాళికలను మరియు సంస్థాగత ప్రణాళికలను తక్కువ సమయంలో సులభముగా ఎలా చేయవచ్చున్నారు. కృత్రిమ మేధను విద్యాభ్యాసన ప్రక్రియలో ఉపయోగించడం ద్వారా విద్యార్థుల నైపుణ్యాలను మరియు వారి అవగాహన సామర్థ్యాన్ని పెంచవచ్చునని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొని పలు అంశాల పట్ల అవగాహన పొందినారు.

# అర్ధరాత్రి చెక్‌పోస్ట్ తనిఖీ చేసిన డీసీపీ

### - అక్రమ పశువుల రవాణాపై కఠిన చర్యలు తప్పవు

### - వాహనాల తనిఖీలను పర్యవేక్షించిన ఏ. భాస్కర్

బెల్లంపల్లి, మే 12 విజన్ ఆంధ్ర : బక్రీద్ పండుగ నేపథ్యంలో అక్రమ పశువుల రవాణాను అరికట్టడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం తాండూర్ మండలంలోని రేపల్ల వాడలో ఏర్పాటు చేసిన అంతర్‌జిల్లా చెక్‌పోస్ట్‌ను మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్ అర్ధరాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు.
చెక్‌పోస్ట్‌లో వాహనాల తనిఖీలను ఆయన పరిశీలించారు.
చెక్‌పోస్ట్ వద్ద అమలులో ఉన్న భద్రతా చర్యలను సమీక్షించిన డీసీపీ, విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, పశువుల రవాణాకు సంబంధించిన పత్రాలను పరిశీలించాలని ఆదేశించారు. వాహనాల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు.
అక్రమ పశువుల రవాణాపై పటిష్ట నిఘా కొనసాగుతోందని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పద రవాణా గమనిస్తే



వెంటనే స్థానిక పోలీసులకు లేదా 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు.
రాత్రి వేళల్లో మరింత అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని డీసీపీ ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో తాండూర్ సీఐ దేవయ్య, బెల్లంపల్లి వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు, తాండూర్ ఎస్ఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నాగులమ్మ క్రాస్ వద్ద ఘోర ప్రమాదం

### - ఇసుక లారీ, బొగ్గు టిప్పర్ ఢీ -- డ్రైవర్ దుర్మరణం

### -యమపాశాల్లా మారుతున్న ఎంఏఆర్ఎల్ బొగ్గు లారీలు

మల్హర్ మే 12 విజన్ ఆంధ్ర : భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండల పరిధిలోని కొయ్యూరు సమీపంలో గల నాగులమ్మ క్రాస్ వద్ద చోటు చేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డ సంఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తాడిచెర్ల ఓపెన్ కాస్ట్ నుండి బొగ్గు తరలించే బొగ్గు టిప్పర్ కాటారం నుండి తాడిచెర్ల కి వెళ్తుండగా అలాగే మంథని నుండి కాటారం వైపు ఇసుక లారీ నాగులమ్మ క్రాస్ వద్ద ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాద ధాటికి ఇసుక లారీ డ్రైవర్, నిజామాబాద్ జిల్లాకు చెందిన కేతి శ్రీనివాస్ (35) లారీ క్యాబిన్‌లోనే చిక్కుకుపోయి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న కొయ్యూరు ఎస్ఐ వడ్లకొండ నరేష్, ఎస్ఐ 2 రజన్ కుమార్ లు ఘటన స్థలానికి చేరుకుని గాయపడ్డ టిప్పర్ డ్రైవర్ ను వెంటనే 108 అంబులెన్స్‌లో భూపాలపల్లిలోని వంద పడకల ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉ



న్నట్లు సమాచారం. తాడిచెర్ల నుండి భూపాలపల్లి జెన్కోకు బొగ్గు తరలించే ఎంఏఆర్ఎల్ ట్రాన్స్‌పోర్ట్ లారీలు అతివేగంగా, నిర్లక్ష్యంగా నడపడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని స్థానికులు మండిపడుతున్నారు. గతంలోనూ మల్లారం, రావులపల్లి పరిసరాల్లో ఈ ట్రాన్స్‌పోర్ట్ వాహనాల వల్లే పలు ప్రమాదాలు జరిగాయని, అధిక లోడుతో జనావాసాల గుండా అతివేగంతో వెళ్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకున్న నేపథ్యంలో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎస్ఐ వడ్లకొండ నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను చక్కదిద్దారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# సర్వేపల్లి గ్రామం అంత్యక్రియలకు సర్పంచ్‌కు రూ.5 వేల సహాయం



చౌటకూర్ మే 12 ( విజన్ ఆంధ్ర) :–చౌటకూర్ మండలం పరిధిలోని సర్వేపల్లి గ్రామానికి చెందిన కొన్యాల చంద్రయ్య ఈరోజు మరణించిన సందర్భంగా అంత్యక్రియల నిమిత్తం వారి కుటుంబానికి గ్రామ నంది కంటి రామచంద్ర రెడ్డి సొంతగా గ్రామంలో ఎవరు మృతి చెందిన తన సొంత నిధులను ఆర్థిక సహాయం కింద అందజేసారు రూ.5,000 ఆర్థిక సహాయం మేకాకుండా కుటుంబానికి అండగా వుంటాను అన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్, తదితర గ్రామస్తులు పాల్గొన్నారు..

# చౌటకూర్ మండలంలోని శివంపేట్ బీరు పరిశ్రమల్లో సీఐటీయూ 'డిమాండ్స్ డే': కార్మికుల భారీ నిరసన

చౌటకూర్ మే 12 ( విజన్ ఆంధ్ర) అఖిల భారత సీఐటీయూ (సీఐటీయూ) పిలుపునిపై చౌటకూర్ మండల పరిధిలో శివంపేట్ బీరు పరిశ్రమల్లో మంగళవారం 'డిమాండ్స్ డే' సందర్భంగా కార్మికులు భారీ నిరసన వ్యక్తం చేశారు. ఒక పరిశ్రమ ముందు జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు మాట్లాడుతూ, "కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను బలహీనపరుస్తున్నాయి. వాటిని పూర్తిగా ఉపసంహరించే వరకు పోరాటం ఆపుకోవద్దు" అని కార్మికులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బాగా రెడ్డి, కార్యదర్శి కోడూరు సురేష్‌లతో పాటు అనేక మంది కార్మిక నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



# శ్రీరామ్ నగర్ గోవింద క్షేత్రంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

## -మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్

భువనగిరి మే 12(విజన్ ఆంధ్ర): హనుమాన్ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని 17వ వార్డు శ్రీరామ్ నగర్ లో వెలసిన గోవింద క్షేత్రం ఆలయంలో వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించినారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, ఆకు పూజలు మరియు విశేష అర్చనలు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ హాజరై స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు:

17వ వార్డు కౌన్సిలర్ చెన్న స్వాతి మహేష్

33వ వార్డు కౌన్సిలర్ నాకోటి నరేష్

32వ వార్డు కౌన్సిలర్ బర్రె సంఘవి కరుణాకర్ పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

శ్రీరామ్ నగర్ మరియు చుట్టుపక్కల ప్రాంతాల నుండి వందలాది మంది భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకోవడంతో ఆలయ ప్రాంగణం హనుమ నామస్మరణతో మారుమోగింది.

ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వార్డు ప్రముఖులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని జయప్రదం చేశారు.

# యువతను మత్తు పదార్థాల నుంచి దూరం చేస్తాం

## - ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు



బెల్లంపల్లి, మే 12 విజన్ఆంధ్ర : గంజాయి వినియోగం భవిష్యత్తును నాశనం చేస్తుంది:సీఐ శ్రీనివాసరావు 1టౌన్ ఇన్ స్పెక్టర్ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం

గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు బెల్లంపల్లి వన్‌టౌన్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టామని గతంలో గంజాయి రవాణా కేసుల్లో నిందితులుగా ఉన్న ఆరుగురిని పోలీస్ స్టేషన్ లో కౌన్సిలింగ్ నిర్వహించి వారిని మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మాదకద్రవ్య పరీక్షలు నిర్వహించగా నలుగురు వ్యక్తులు ఎస్కే జమీర్, ఆర్. మహ్మద్ తాజ్‌బాబా, ఎస్కే కలీం, తోట మనీదీప్ లకు పాజిటివ్‌గా తేలినట్లు ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు వెల్లడించారు.

వీరిపై కేసులు నమోదు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరచగా, కోర్టు ఆదేశాల మేరకు 15 రోజుల పాటు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలోని వ్యసన విముక్తి కేంద్రానికి తరలించిన్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల రవాణా, నిల్వ, వినియోగంపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.

# పదిలో ప్రధమ స్థానాలు సాధించిన విద్యార్థులకు బంపరాఫర్

- విజయవాడ నుంచి హైదరాబాద్ వరకు విమానంలో ఉచిత ప్రయాణం
- హామీ అమలు చేసిన ఊటుకూరు ఫౌండేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు
- విద్యార్థుల వెంట ఎంఈఓ దామాల పుల్లయ్య



బోనకల్, మే 12 (విజన్ ఆంధ్ర) ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ప్రధమ ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు ఉచిత విమాన ప్రయాణం చేసి విద్యార్థులలో ఆలోచనలు పట్టుదలను కల్పించారు. ఊటుకూరు ఫౌండేషన్ అధ్యక్షుడు ఊటుకూరి నాగేశ్వరరావు విద్యార్థులకు ఇచ్చిన హామీల అమలు చేసి మంగళవారం చూపించారు. మండల పరిధిలోని తూటికుంట్ల ప్రాథమిక పాఠశాలలో 12 మార్చి 2026న జరిగిన ఓ కార్యక్రమంలో తూటికుంట్ల గ్రామానికి చెందిన ఊటుకూరు ఫౌండేషన్ అధ్యక్షుడు ఊటుకూరి నాగేశ్వరరావు 10వ తరగతిలో బాలికల బాలుర విభాగంలో ప్రథమ స్థానాలను సాధించిన విద్యార్థులను ఉచితంగా విజయవాడ నుంచి హైదరాబాదు వరకు విమాన ప్రయాణం చేస్తానని హామీ ఇచ్చారు.ఇందులో భాగంగా 10 వ తరగతిలో ఆళ్లపాడు ఉన్నత పాఠశాలకు చెందిన ఆళ్లపాడు విద్యార్థి తాళ్లూరి భాను ప్రకాష్ బాలుర విభాగంలో మండల స్థాయిలో 6 మార్కులకు గాను 560 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచాడు. అదేవిధంగా బాలికల విభాగంలో రావినూతల ఉన్నత పాఠశాలకు చెందిన తాటికొండ చంద్రిక 6 మార్కులకు గాను 546 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. వీరిద్దరిని ఉచిత విమాన ప్రయాణ సౌకర్యం వరించింది.

# ఉపాధి కూలీలకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

## పెద్దతూండ్ల సర్పంచ్ బండారి నర్సింగం



మల్హార్, మే 12 విజన్ ఆంధ్ర: పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉపాధి హామీ కూలీలకు మండలంలోని పెద్దతూండ్ల గ్రామ సర్పంచ్ బండారి నర్సింగం ఆధ్వర్యంలో మంగళవారం మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఉపాధి పనుల వద్దకు వెళ్లిన సర్పంచ్, కూలీలకు ఎండదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తాళ్ళ రవీందర్, వార్డు సభ్యులు తాటికొండ కేశవ చారి, బియ్యాన్ని శ్రీవాణి కుమార్, రాజమౌళి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు రాయసమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



# మహాదేవపురం అగ్నిప్రమాద బాధితులకు ఈటల భరోసా

**ఘటనాస్థలాన్ని పరిశీలించిన మల్కాజిగిరి ఎంపీ..**

**బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ**

**బీజేపీ నేతలతో కలిసి పరామర్శ.. నష్టంపై అధికారుల నివేదిక కోరిన ఈటల రాజేందర్**

కుత్బుల్లాపూర్, మే 12 (విజన్ ఆంధ్ర): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం డివిజన్ పరిధిలోని మహాదేవపురంలో ఇటీవల చోటుచేసుకున్న భారీ అగ్నిప్రమాద ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలో ఆస్తి నష్టం చవిచూసిన బాధితులను పరామర్శించేందుకు మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ మంగళవారం ప్రమాద స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదం సంభవించిన తీరును స్థానికుల ద్వారా తెలుసుకున్న ఎంపీ, ఘటనలో నష్టపోయిన కుటుంబాలతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. బాధితులకు ప్రభుత్వం తగిన సహాయం అందించాలని, నష్టంపై సమగ్ర అంచనా వేసి వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను కోరినట్లు తెలిపారు. అగ్నిప్రమాదం వంటి ఘటనలు పునరావృతం కాకుండా అగ్నిమాపక భద్రతా చర్యలను కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉందని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు బీజేపీ అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి, కేకేపి బీజేపీ నేత కాంతారావు, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు బక్క శంకర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో-కన్వీనర్, గాజులరామారం మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యకు పరిష్కారం చూపిన చేవెళ్ల త్రిశూల్ టీమ్



చేవెళ్ల,మే 12 (విజన్ ఆంధ్ర): చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని మందుముల నగర్ కాలనీలో మిషన్ భగీరథ వాల్వ్ గుంత ప్రమాదకరంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో మంగళవారం చేవెళ్ల త్రిశూల్ టీమ్ సభ్యులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సమస్యను పరిష్కరించారు. కాలనీలో రోడ్డు మధ్యలో మూత లేకుండా ఉన్న గుంత కారణంగా పాదచారులు, వాహనదారులు నిత్యం ప్రమాద భయంతో రాకపోకలు సాగించాల్సి వచ్చేది. ఈ విషయాన్ని స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో త్రిశూల్ టీమ్ సభ్యులు కాసుల వివేక్ గౌడ్, రెడ్డిశెట్టి సాయిరాం, బండారి శరత్ పవన్ రెడ్డి, కాసుల అరుణ్ గౌడ్, బాస శివకుమార్ తదితరులు స్వయంగా సమస్య పరిష్కారానికి ముందుకొచ్చారు. వారు గుంతపై పటిష్టమైన సిమెంట్ మూత ఏర్పాటు చేసి, చుట్టుపక్కల సిమెంట్ పనులు నిర్వహించి వాహనాలు సురక్షితంగా వెళ్లేలా చర్యలు చేపట్టారు. ప్రజా సమస్యను సామాజిక బాధ్యతగా భావించి పరిష్కరించిన త్రిశూల్ టీమ్ సభ్యులను కాలనీ వాసులు అభినందించారు. అధికారులు కూడా ఇలాంటి సమస్యలపై తక్షణమే స్పందించాలని స్థానికులు కోరారు.

# చౌటాకూర్ మండల ప్రజలకు, రైతులకు విజ్ఞప్తి

**- రోడ్లపై ధాన్యం ఆరబోయడం వలన రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ.**

**- రహదారులపై ధాన్యం ఆరబోసి ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవు..**

**- రైతులు ప్రభుత్వం సూచించిన నిర్దిష్ట కల్లాల్లోనే ధాన్యం ఆరబోసుకోవాలి.**



చౌటకూర్ మే 12 ( విజన్ ఆంధ్ర ) మండల పరిధిలో కొంతమంది రైతులు, వ్యాపారులు రహదారులపై ధాన్యం ఆరబోస్తుండటంతో వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి.. ముఖ్యంగా రాత్రి సమయంలో రోడ్లపై ఆరబోసిన ధాన్యం సరిగా కనిపించక వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రోడ్లపై ధాన్యం ఆరబోయడం వలన వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడమే కాకుండా, ప్రజల ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో రహదారులపై ధాన్యం ఆరబోసి రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోబడుతాయి .రైతులు తమ ధాన్యాన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన నిర్దిష్ట కల్లాల్లో లేదా వ్యవసాయ శాఖ సూచించిన ప్రదేశాల్లోనే ఆరబోసుకోవాలి. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి.

# కార్మిక వ్యతిరేక విధానాలపై కుత్బుల్లాపూర్‌లో కార్మిక సంఘాల గర్జన!

**డిమాండ్స్ డే సందర్భంగా సీఐటీయూ--ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ**

**నూతన లేబర్ కోడ్లు రద్దు చేయాలి.. కనీస వేతనం ?26 వేలు అమలు చేయాలని డిమాండ్**



కుత్బుల్లాపూర్, మే 12 (విజన్ ఆంధ్ర): కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ డిమాండ్స్ డే సందర్భంగా సీఐటీయూ, ఏఐటీయూసీ కుత్బుల్లాపూర్ మండల కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. షాపూర్ నగర్ రైతు బజార్ నుంచి సాగర్ హోటల్ చౌరస్తా వరకు కార్మికులు నినాదాల తో ర్యాలీ చేపట్టి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికులను కార్పొరేట్ సంస్థలకు బానిసలుగా మార్చే నూతన లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కార్మిక చట్టాలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. రోజుకు 8 గంటల పని విధానాన్ని అమలు చేసి, కనీస వేతనంగా నెలకు రూ.26 వేలును నిర్ణయించాలని అన్నారు. అదేవిధంగా ప్రతి కార్మికుడికి ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్ వంటి హక్కులు కల్పించాలని, అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత అందించాలని డిమాండ్ చేశారు. 60 సంవత్సరాలు నిండిన కార్మికులకు నెలకు రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలని, ఇల్లు లేని అసంఘటిత రంగ కార్మికులకు ప్రభుత్వ ఆధ్వర్యంలో గృహాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కన్వీనర్ కీలుకాని లక్ష్మణ్, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు ఉమామహేష్, నరసింహారెడ్డి, అశోక్ రెడ్డి, మహేందర్, మల్లారెడ్డి, కనకయ్య, శ్రీశైలం, యాదవ రెడ్డి, కరుణాకర్, సాధులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం

- రైతులు పకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించాలి
- మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి



అందోల్ / సంగారెడ్డి మే (విజన్ ఆంధ్ర ) : వట్ పల్లి మండలం ఉసిరికా పల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి అధ్యక్షతన "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ప్రధాన భూసార శాస్త్రవేత్త డా.రాజేశ్వర్ నాయక్ పాల్గొని రైతులకు పలు ముఖ్యమైన సూచనలు చేశారు. పంటల దిగుబడిని పెంచడంతో పాటు నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే తక్కువ మోతాదులో యూరియా పురుగు మందుల రసాయనాలు వాడాలని, పంట మార్పిడి విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు. అనంతరం డాక్టర్ సుష్మ మాట్లాడుతూ రైతులు అవసరానికి తగ్గట్టుగా మాత్రమే ఎరువులను వినియోగించాలని, అవసరం లేనివిధంగా రసాయనాల వాడకాన్ని తగ్గించాలని తెలిపారు. నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడటం ప్రతి రైతు బాధ్యత అని పేర్కొన్నారు. అలాగే సాగునీటిని వృథా చేయకుండా సంరక్షించి భావితరాలకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఉత్పత్తి చేయవచ్చని, రైతులు ప్రకృతి స్నేహపూర్వక వ్యవసాయ విధానాల వైపు అడుగులు వేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ అధికారులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 51 మంది రైతులు పాల్గొని శాస్త్రవేత్తల సూచనలు ఆసక్తిగా వినిపించారు. ఏఈఓ పరిమళ, గ్రామ పంచాయతీ కార్యదర్శి శేఖర్ ,గ్రామ యువత,రైతులు పాల్గొన్నారు.



## శ్రీ అర్ధగిరి వీరాంజనేయ స్వామివారికి పట్టు వస్త్రముల సమర్పణ

శ్రీ అర్ధగిరి వీరాంజనేయ స్వామి ఆలయం నందు తేది:12-05-2026 న హనుమాన్ జయంతి సందర్భంగా ఉదయం 5 గంటలకు అభిషేకం, అలంకారం నిర్వహించడం అయినది. 11 గంటలకు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం నుండి శ్రీ స్వామి వారికి పట్టు వస్త్రములను తవణంపల్లి పూతలపట్టు శాసన సభ్యులు శ్రీ డా: కలికిరి మురళీమోహన్ గారు ,చిత్తూరు జిల్లా ్రా శ్రీ తుషార్ డుడే గారు, మరియు కాణిపాకం ఆలయ చైర్మన్ శ్రీ మణినాయుడు గారు,ఈఓ,గారు తవణంపల్లి మండల అధ్యక్షులు శ్రీ +. వెంకటేష్ చౌదరి గారు పట్టు వస్త్రములను సమర్పించారు.అదేవిధంగా మధ్యాహ్నం 12 గంటలకు సుదర్శహోమం నిర్వహించడం అయినది.ఇందులో భాగంగా ఆలయ చైర్మన్ శ్రీ ూ . రఘుపతి గారీ దంపతులు, ఆలయ జుశీ శ్రీ జు.మునిశేఖర్ గారు పాల్గొన్నారు

# ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తా....

### ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలి...

### వేశాలమ్మ వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి

తిరుపతి, మే 12 : తిరుపతిలోని వేశాలమ్మ, తాళ్లపాక పెద్ద గంగమ్మ, అంకాలమ్మ, ఇతర ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తెలిపారు. మంగళవారం వేశాలమ్మ అమ్మవారిని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి దర్శించుకున్నారు. అంతకుముందు ఆయన ఆలయం వద్దకు రాగానే తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో రాష్ట్ర నేతలు సురా సుధాకర్ రెడ్డి, పుష్పావతి యాదవ్, బుల్లెట్ రమణ, కృష్ణ యాదవ్ ఆలయ చైర్మన్ కామాటం జగదీష్ రెడ్డి పాలకమండలి సభ్యులు ఘనస్వాగతం పలికారు. అమ్మవారి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలను చైర్మన్ జగదీష్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డిని టిడిపి మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం నేతృత్వంలో నాయకులు శాలువలతో ఘనంగా సత్కరించారు. అనంతరం అంకాలమ్మ అమ్మవారిని బొజ్జల



సుధీర్ రెడ్డి దర్శించుకున్నారు. అక్కడ ఆలయ పాలకమండలి చైర్మన్ తో పాటు సభ్యులు ఘనస్వాగతం పలికి అమ్మవారి దర్శనం ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ తిరుపతి నియోజకవర్గం ప్రజలందరికీ గంగమ్మ జాతర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులతో సకాలంలో వర్షాలు కురిసి రైతులకు పంటలు చేతికందే విధంగా అమ్మ ఆశీస్సులు ఉండాలని కోరారు. ఇక ప్రతి ఏటా తిరుపతి నగరంలోని గ్రామదేవతలను దర్శించుకోవడానికి వస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు మేడి కుర్తీ విశ్వనాథం, రాజారాం పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

# హైకోర్టును ఆశ్రయించిన బండి భగీరథ్..!

### - మధ్యంతర బెయిల్ కావాలని అభ్యర్థన,

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మే 12,(విజన్ ఆంధ్ర ప్రతినిధి): కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ హైకోర్టును ఆశ్రయించారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన పోక్సో కేసులో మధ్యంతర బెయిల్ కోరుతూ బండి భగీరథ్ పిటిషన్ దాఖలు చేశారు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు బండి భగీరథ్ కేసుపై ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేస్తూ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు.

ఈ కేసు సున్నితమైనది కావడంతో మహిళా ఐపీఎస్ అధికారిణి పర్యవేక్షణలో దర్యాప్తు కొనసాగించాలని డీజీపీ నిర్ణయించారు.

ఇప్పటికే బాధితురాలి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేయడం జరిగింది. సిట్ ఏర్పాటు నేపథ్యంలో మరోసారి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసే అవకాశం ఉంది. మరోవైపు బండి భగీరథ్ కోసం పోలీసుల గాలింపు కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి అన్ని ఆధారాలను సేకరిస్తున్నామని, నేరం రుజువైతే నిందితుడిని కచ్చితంగా అరెస్ట్ చేస్తామని కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ స్పష్టం చేశారు. ఈనేపథ్యంలో మధ్యంతర బెయిల్ కోరుతూ బగీరథ్ తరపు న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు.



# కొనుగోళ్లపై నిర్లక్ష్యం వహిస్తేఅధికారుల పే చర్యలు తప్పవు: సీఎం రేవంత్ రెడ్డి,

ధాన్యం తరలింపునకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉండేలా చూడాలని రవాణా శాఖ కమిషనర్‌ను ముఖ్యమంత్రి ఆదేశించారు. సమస్య తీవ్రతను గుర్తించి జిల్లా కలెక్టర్లు సరైన చర్యలు తీసుకోవాలని, ప్రతీ అధికారి జవాబుదారీతనంతో వ్యవహరించాల్సిందేనన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై చర్యలకూ ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు.

వివిధ ప్రాంతాల్లో గోడౌన్స్ సమస్య ఉన్నట్లు తెలుస్తోందని, అలాంటి ప్రాంతాల్లో అవసరాన్నిబట్టి తాత్కాలిక ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్లకు సీఎం సూచించారు. రైతుబజార్లు, ఫంక్షన్ హాల్స్‌ను ఎంగేజ్ చేసి ధాన్యాన్ని తరలించాలన్నారు. వెసులుబాటు ఆధారంగా అక్కడినుంచి గోడౌన్స్‌కు తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని తెలిపారు.

మొక్కజొన్న పంట ఎక్కువగా వచ్చే జిల్లాల కలెక్టర్లు కొనుగోళ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట పోలీస్ సహాయం తీసుకుని కలెక్టర్లు ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలాచూడాలని సూచించారు. ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్లపై కలెక్టర్లు ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రిపోర్ట్ పంపించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

అకాల నష్టాన్ని తగ్గించేందుకు ప్రత్యేక వ్యవస్థ:

అకాల వర్షాలతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. అకాల వర్షాల సమయంలో కల్లాల వద్ద ధాన్యం తడవకుండా ఉండేందుకు అవసరమైన టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వాతావరణ శాఖ సూచనల ఆధారంగా ఎప్పటికప్పుడు రైతులను అప్రమత్తం చేసేందుకు మండల స్థాయిలో ఒక అధికారిని నియమించాలని, వాతావరణ సూచనలను రైతులకు చేరవేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించారు.

ప్రతీ ×ఖూ సెంటర్‌కు ఒక అధికారిని నియమించి కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలు తలెత్తకుండా చూడాలని తెలిపారు. ప్రతీ రైస్ మిల్లు దగ్గర ఒక బాధ్యతాయుతమైన అధికారిని నియమించి పర్యవేక్షించాలన్నారు. ధాన్యం లోడింగ్ లో జాప్యం జరగకుండా స్థానికంగా ఉన్న హమాలీలను గుర్తించి వారితో పని చేయించుకోవాలని తెలిపారు. ధాన్యం లోడ్ చేసిన వెంటనే రైతులకు రశీదు అందేలా చర్యలు తీసుకోవాలని, అలా చేస్తే తాలు, తరుగు పేరుతో అక్రమాలు జరగకుండా చూడొచ్చని చెప్పారు. లారీల కొరతను అధిగమించేందుకు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో ట్రాక్టర్లు, ఇతర వాహనాలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచాంరు. కలెక్టర్లు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని, ఏ సమస్య వచ్చినా కలెక్టర్లు బాధ్యత తీసుకుని పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు, వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

పంట కొనుగోళ్లపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలి: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,

ధాన్యం సేకరణ, మొక్కజొన్న కొనుగోళ్ల విషయంలో కలెక్టర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. జిల్లాల్లో ఎక్కడ సమస్యలున్నా ప్రభుత్వం దృష్టికి తీసుకురావలని, ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన అన్ని సహాయ, సహకారాలను అందిస్తుందని తెలిపారు. ధాన్యం సేకరణ విషయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందించేందుకైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు: మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు,

దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిందన్నారు. సరిహద్దు రాష్ట్రాల రైతులు కొంత మంది ధాన్యాన్ని తెలంగాణలో కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారని, దీంతో కొన్నిచోట్ల సమస్యలు తలెత్తుతున్నాయని మంత్రి అభిప్రాయపడ్డారు. సరిహద్దు రాష్ట్రాల రైతులు ధాన్యం తీసుకురాకుండా సంబంధిత జిల్లా కలెక్టర్లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ నెలాఖరులోగా ధాన్యం సేకరణ ప్రక్రియను పూర్తి చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు.



## ఘనంగా నాభి శిల 7వ వార్షికోత్సవ వేడుకలు..

కుకునూరుపల్లి, మే 12,విజన్ ఆంధ్ర : మండల పరిధిలోని బొబ్బాయిపల్లి గ్రామంలో మంగళవారం నాభి శిల బొడ్రాయి ఏడవ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి..గ్రామంలోని ప్రజలందరూ అత్యంత భక్తి శ్రద్ధలతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య పూజలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. గ్రామం అంతటా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కన్నమైన సంపత్ యాదవ్, ఎన్ఆర్ఈజీఎస్ మాజీ సభ్యులు కోల సద్గుణ రవీందర్, పాలక వర్గ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయిలో మేడల్స్ సాధించిన క్రీడాకారులను సన్మానించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



గద్వాల మే 12 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లా కు చెందిన అథ్లెటిక్స్ క్రీడాకారులు ఈ నెల మే 10 తేదీన హనుమకొండ జిల్లా కేంద్రం లోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన 3 వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. ఈ పోటీలలో గద్వాల జిల్లా కు చెందిన క్రీడాకారులు ఖ/18 విభాగంలో దినేష్ (హై జంప్) 2వ ప్రైజ్ సిల్వర్ మెడల్ ఈ లాంగ్ జంప్ బ్రౌన్ మేడల్, యు.రాహుల్ హై జంప్ నందు సిల్వర్, బ్రౌన్ మేడల్స్ సాధించారు. వీరిని మంగళవారం గద్వాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో గద్వాల శాసనసభ్యుడు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సన్మానం చేసి అభినందించారు. అథ్లెటిక్స్ లో రాష్ట్ర, జాతీయ స్థాయి లో మెడల్స్ సాధించి జిల్లా కు పేరు తేవాలని అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బీసన్న, జిల్లా ఉపాధ్యక్షుడు యం. వెంకట్రాములు, జాయింట్ సెక్రటరీ మం.నాగేష్, సెక్రటరీ సతీష్ కుమార్ పాల్గొన్నారు.

# కొండగట్టు అంజన్న చెంత కూన శ్రీశైలం గౌడ్ ప్రత్యేక పూజలు

కుత్బుల్లాపూర్, మే 12 (విజన్ ఆంధ్ర): హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ మంగళవారం జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం తన తనయుడు కూన కృష్ణ గౌడ్ చేపట్టిన హనుమాన్ దీక్షా మాల విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మాలధారణ పూర్తి చేసుకున్న తనయుడితో కలిసి స్వామివారిని దర్శించుకోవడం సంతోషంగా ఉ ందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

దర్శనానంతరం ఆలయ పండితులు కూన శ్రీశైలం గౌడ్ కుటుంబ సభ్యులకు వేద ఆశీర్వచనాలు పలికి, స్వామివారి తీర్థ ప్రసాదాలను



అందజేశారు. ఆంజనేయ స్వామి ఆశీస్సులతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వారి అనుచరులు, అభిమానులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం

### - ప్రకృతిని ప్రేమిద్దాం.. పచ్చదనాన్ని పెంచుదాం..
### ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం!
### ?పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత: సదాశయ ఫౌండేషన్ పిలుపు

కుత్బుల్లాపూర్, మే 12 (విజన్ ఆంధ్ర): నేటి ఆధునిక కాలంలో మానవ తప్పిదాల వల్ల పర్యావరణం తీవ్ర ముప్పును ఎదుర్కొంటోంది. ముఖ్యంగా 'ప్లాస్టిక్' అనే భూతం ప్రకృతిని కబళిస్తూ, జీవవైవిధ్యాన్ని ప్రశ్నార్థకం చేస్తోంది. ఈ నేపథ్యంలో పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ సదాశయ ఫౌండేషన్ 'ప్రకృతిమిత్ర' పేరుతో భారీ చైతన్య కార్యక్రమాన్ని చేపట్టింది. ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా సాగుతున్న ఈ ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఫౌండేషన్ పిలుపునిచ్చింది.

అంతరిస్తున్న జీవజాలం – కలుషిత జలవనరులు

ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల నదులు, కాలువలు విపరీతంగా కలుషితమవుతు న్నాయి. మూగజీవాలు, పక్షులు ప్లాస్టిక్‌ను ఆహారంగా భావించి తిని ప్రాణాలు కోల్పోతున్నాయి. సముద్ర గర్భంలోని తాబేళ్లు, చేపలు సైతం ప్లాస్టిక్ ఉచ్చులో చిక్కుకుని విలవిల్లాడుతున్నాయి. ప్లాస్టిక్ భూమిలో కలవడానికి వందల ఏళ్లు పడుతుండటంతో నేల సారం దెబ్బతిని, భవిష్యత్తులో సాగుకు పనికిరాకుండా పోయే ప్రమాదం ఉందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాలు విషతుల్యం కాకముందే మేల్కొనాలని వారు హెచ్చరిస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణే జీవకోటికి రక్షణ: కోలా రవీందర్ ముదిరాజ్

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ సామాజిక కార్యకర్త, ప్రకృతి ప్రేమికులు కోలా రవీందర్ ముదిరాజ్ మాట్లాడుతూ పర్యావరణ సంరక్షణపై కీలక వ్యాఖ్యలు చేశారు: "మనం ప్రకృతిని ప్రేమిస్తే, ప్రకృతి మనల్ని కాపాడుతుంది. అభివృద్ధి పేరుతో మనం చేస్తున్న పర్యావరణ విధ్వంసం మన ఉనికికే ప్రమాదంగా మారింది. ముఖ్యంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం అనేది మనిషి తన గొయ్యి తనే తవ్వుకున్నట్లు అవుతోంది. ప్రతి గ్రామం, ప్రతి నగరం పచ్చదనంతో కళకళలాడాలి. ప్లాస్టిక్ రహిత సమాజం దిశగా ప్రతి పౌరుడు అడుగులు వేయాలి. మనం మన పిల్లలకు ఇచ్చే అతిపెద్ద ఆస్తి కోట్లు కాదు.. స్వచ్ఛమైన గాలి, నీరు మాత్రమే. ఆ దిశగా సదాశయ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయం."

ఫౌండేషన్ సూచనలు – ఆచరించాల్సిన నియమాలు:

భావి తరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించాలంటే ప్రతి ఒక్కరూ ఈ క్రింది నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఫౌండేషన్ సభ్యులు కోరుతున్నారు: ప్లాస్టిక్‌కు గుడ్‌బై చెప్పండి: ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, ఒకసారి వాడి పారేసే (సింగిల్ యూజ్) వస్తువులను పూర్తిగా నిషేధించాలి. బట్ట సంచులే మేలు: మార్కెట్‌కు వెళ్లేటప్పుడు ప్లాస్టిక్ కవర్లకు బదులుగా పర్యావరణ హితమైన బట్ట సంచులను మాత్రమే వాడాలి. మొక్కలు నాటండి: ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలి. జల సంరక్షణ: నీటిని వృథా చేయకుండా సహజ జలవనరులను కాపాడుకోవాలి.

మేల్కొందాం.. ప్రకృతిని కాపాడుకుందాం!

సహజ వనరులు సర్వనాశనం కాకముందే మేల్కొనాలని సదాశయ ఫౌండేషన్ స్పష్టం చేసింది. ఈ చైతన్య కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరుతూ, పర్యావరణ రక్షణపై సందేహాలు ఉన్నా లేదా ఈ ఉద్యమానికి మద్దతు తెలపాలన్నా 98492 54747 నంబర్‌ను సంప్రదించాలని ఫౌండేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

# దుండిగల్ సర్కిల్ పరిధిలో చెత్త పై అడిషనల్ కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలన

### -పారిశుద్ధ్యంపై అలసత్వం వహిస్తే వేటు తప్పదు!
### -నిబంధనలు మీరితే లైసెన్సులు రద్దు: వ్యాపారులకు 'నో బిన్ - నో లైసెన్స్' అల్టిమేటం
### - క్షేత్రస్థాయిలో యాదగిరి రావు ఆకస్మిక తనిఖీ - అధికారులపై ఆగ్రహం
### - చెత్తను సంపదగా మార్చుదాం.. కాలనీవాసులకు 'కంపోస్ట్' తయారీపై ప్రత్యక్ష అవగాహన

దుండిగల్, మే 12 (విజన్ ఆంధ్ర): ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా దుండిగల్ సర్కిల్ పరిధిలో పారిశు ద్ధ్య నిర్వహణను పట్టాలెక్కించేందుకు యంత్రాంగం నడుం బిగించింది. మంగళవారం దుండిగల్ సర్కిల్‌లో అడిషనల్ కమిషనర్ యాదగిరి రావు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వహిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఆయన అధికారులను, సిబ్బందిని కఠినంగా హెచ్చరించారు.

– వ్యాపారులకు 'లైసెన్స్' హెచ్చరిక: "నో బిన్ –– నో లైసెన్స్"

దుండిగల్ సర్కిల్ పరిధిలోని హోటళ్లు, వాణిజ్య సముదాయాల యజమానులకు అడిషనల్ కమిషనర్ పక్కా అల్టిమేటం జారీ చేశారు. ప్రతి దుకాణం వద్ద తప్పనిసరిగా తడి, పొడి చెత్త కోసం వేర్వేరు డస్ట్‌బిన్లు ఉంచాలని ఆదేశించారు. "నో బిన్ –– నో లైసెన్స్" విధానాన్ని సర్కిల్ వ్యాప్తంగా కఠినంగా అమలు చేస్తామని, నిబంధనలు ఉల్లంఘించే సంస్థల లైసెన్సులను రద్దు చేయడంతో పాటు, భారీ జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు.

వ్యర్థాల నిర్వహణపై వినూత్న అవగాహన

కేవలం చెత్తను తరలించడమే కాకుండా, దానిని ఆదాయ వనరుగా మార్చుకోవాలన్న సంకల్పంతో దొమ్మర పోచంపల్లిలోని పిఎన్ఆర్ విడోస్ కాలనీలో ఆయన పర్యటించారు. అక్కడ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులకు తడి చెత్త నుంచి ఇంటి వద్దే కంపోస్ట్ (ఎరువు) తయారు చేసుకునే విధానాన్ని ప్రత్యక్షంగా వివరించారు. "చెత్తను పారవేయడం కాదు.. దానిని సంపదగా మార్చుకోవాలి" అని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

– అధికారులకు డెడ్‌లైన్.. క్లీన్ సర్కిలే లక్ష్యం!

రహదారుల పక్కన పెరిగిన పిచ్చి మొక్కలను, రోడ్లపై పేరుకుపోయిన నిర్మాణ వ్యర్థాలను (జఢణ ఘోర్వ) వెంటనే తొలగించాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులకు ఆయన డెడ్‌లైన్ విధించారు. ప్రజల ఆరోగ్యం, దుండిగల్ సర్కిల్ సుందరీకరణ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని,



విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కరణ్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డిప్యూటీ ఇంజనీర్ అన్వేష్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ అశోక్ కుమార్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ పి. సాత్విక్, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

# ఐటీఐ విద్యతో ఉజ్వల భవిష్యత్తు

## - మర్పల్లి ప్రభుత్వ ఐటీఐలో అడ్మిషన్ల సందడి.. దరఖాస్తుల ఆహ్వానం!

## - జూన్ 8 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

## - ప్రిన్సిపాల్ వీర మల్లేష్ వెల్లడి



మర్పల్లి, మే 12 విజన్ ఆంధ్ర:సాంకేతిక నైపుణ్యంతోనే యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని మర్పల్లి ప్రభుత్వ ఐటీఐ – ఏటీసీ ప్రిన్సిపాల్ వీర మల్లేష్ అన్నారు. వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ – ఏటీసీ లో 2026–27 విద్యా సంవత్సరానికి గాను వివిధ కోర్సుల్లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ వీర మల్లేష్ ఒక ప్రకటనలో తెలిపారు. సాంకేతిక విద్య ద్వారా ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలనుకునే విద్యార్థులకు ఇది ఒక సువర్ణావకాశమని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది పాత కోర్సులతో పాటు పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రిక్ వెహికల్ టెక్నీషియన్ వంటి అధునాతన కోర్సులను ప్రవేశపెట్టినట్లు ఆయన వివరించారు

1.ఆటోమేషన్ టెక్నీషియన్ 1 సంవత్సరం , 2.ఇండస్ట్రియల్ రోబోటిక్స్ & డిజిటల్ మ్యానుఫ్యాక్చరింగ్ టెక్నీషియన్ 1 సంవత్సరం , 3.ఇంజనీరింగ్ డిజైన్ టెక్నీషియన్ 1 సంవత్సరం, 4. సిఎన్సి మెషినింగ్ టెక్నీషియన్ 2 సంవత్సరాలు, 5. వర్చువల్ అనాలసిస్ & డిజైనర్ – ఎఫ్ ఈ ఏం టెక్నీషియన్ 2 సంవత్సరాలు, 6.మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ టెక్నీషియన్ 2 సంవత్సరాలు, 7.ఎలక్ట్రీషియన్ 2 సంవత్సరాలు, 8. ఫిట్టర్ 2 సంవత్సరాలు, 8 కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు.

10వ తరగతి ఉత్తీర్ణులు. అభ్యర్థి వయస్సు 14 ఏళ్లు నిండి ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఔఞ్.ఐఞ్రీఖఅఞ్ఘుఖు.ఞ్రశీఙ.ఱఅ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలనీ తెలిపారు. ఈ నెల 14-05-2026 నుండి ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులకు చివరి తేదీ: 08-06-2026 అని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు 8500463608 లేదా 8500463686 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు. వికారాబాద్ జిల్లాలో నాణ్యమైన సాంకేతిక విద్యను అందించడంలో మర్పల్లి ఐటీఐ ముందుంటుందని, నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.



## ఖమ్మం కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయండి

### - వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శి

బోనకల్ మే 12 (విజన్ ఆంధ్ర) : వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా కమిటీ నిర్ణయం మేరకు ఈనెల ఖమ్మం కలెక్టరేట్ ముందు వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20వ తారీకు కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని మంగళవారం బోనకల్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు బోనకల్ మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు తెల్లాకుల శ్రీనివాసరావు, బంధం శ్రీనివాసరావు, చేరుకొని వారి సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారం కోసం ఈనెల 15వ తారీకు అన్ని గ్రామపంచాయతీ ఆఫీసుల ముందు జరిగే ధర్నాను ఈ నెల 20వ తారీకు ఖమ్మం కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం బోనకల్ మండలం కమిటీ నెంబర్ ఉప్పర శ్రీను, వ్యవసాయ కూలీలు ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక విధానాలు రద్దు చేయాలి

## ఎల్ఐసి కార్యాలయంలో జాతీయ డిమాండ్ల దినోత్సవ నిరసన



గద్వాల మే 12 (విజన్ ఆంధ్ర) : జోగులాంబ గద్వాల జిల్లాలోని ఎల్ఐసి కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో జాతీయ డిమాండ్ల దినోత్సవం సందర్భంగా సంఘీభావ నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి బంగి రంగారావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పోరాడుతున్న కార్మికులకు మద్దతుగా కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర రంగాల సమాఖ్యలు ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ను వెంటనే రద్దు చేయాలని, ట్రేడ్ యూనియన్లతో తక్షణ త్రైపాక్షిక చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాన్ని నెలకు రూ.26 వేలుగా నిర్ణయించి, 8 గంటల పని విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేసి సమాన వేతనాలు, సౌకర్యాలు కల్పించాలని అన్నారు. అదనపు పనికి రెట్టింపు ఓవర్‌టైమ్ వేతనం చెల్లించడంతో పాటు కార్యాలయ భద్రత, చట్టబద్ధ హక్కులను అమలు చేయాలని పేర్కొన్నారు. అరెస్టు చేసిన కార్మికులు, కార్యకర్తలను తక్షణమే విడుదల చేసి తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అత్యావశ్యక వస్తువుల ధరలను నియంత్రించి అందుబాటు ధరలో ఎల్పీజీ అందించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఉదయ్‌కుమార్, అనిల్‌కుమార్, రాఘవేంద్ర, కృష్ణచైతన్య, శైలేష్, ప్రవీణ్‌కుమార్, మనీష్, జాన్‌బాబు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ జమ్ములమ్మ పరశురామ స్వామిని దర్శించుకున్న ఎంపీ డీకే అరుణ భరత సింహారెడ్డి



గద్వాల మే 12(విజన్ ఆంధ్ర) : నడిగడ్డ భక్తుల ఇలవేల్పు అయిన జమ్మిచేడు శ్రీ జమ్ములమ్మ పరశురామ స్వామి దేవాలయాన్ని మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ భరత సింహారెడ్డి దంపతులు మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో పురందరు కుమార్ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి దేవాలయంలో అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జోగులాంబ గద్వాల జిల్లా ప్రజలు స వర్షాలు కురిసి పంటలు పండి సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించినట్టు తెలిపారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధ రెడ్డి, జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మట్టి మాఫియా దందా..?

## - తవ్వకాలకు అనుమతి ఎవరు ఇచ్చారు..?

## - ఎన్‌హెచ్--980పీ పక్కనే భారీ గుంతలు.. అధికారులు మాత్రం మౌనం..?

టేకులపల్లి, విజన్ ఆంధ్ర మే 12 : మండలంలోని సులానగర్ పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న భారీ అక్రమ మట్టి తవ్వకాల వ్యవహారం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జాతీయ రహదారి ఎన్‌హెచ్--980పీ పక్కనే భారీ స్థాయిలో మట్టి తవ్వకాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ప్రజల్లో తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.రోజుల తరబడి భారీ యంత్రాలతో లోతైన గుంతలు తవ్వుతూ వందలాది ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ, మైనింగ్, పోలీస్ శాఖలకు సమాచారం ఉన్నప్పటికీ అక్రమ తవ్వకాలు నిరంతరాయంగా కొనసాగుతుండటం వెనుక అధికారుల నిర్లక్ష్యమా..? లేక అండదండలా..? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఎన్‌హెచ్--980పీ రహదారి పక్కనే ప్రమాదకరంగా భారీ గుంతలు ఏర్పడినా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. "ఇంత పెద్ద ఎత్తున మట్టి తవ్వకాలు జరుగుతుంటే సంబంధిత అధికారులకు తెలియదా..? తెలిసి జరుగుతుందా..? తెలియక జరుగుతుందా..?" అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల జెసిబిలతో తవ్విన మట్టిని ఎక్కడికి తరలిస్తున్నారనే



అంశంపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిజంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల కోసమే మట్టిని తరలిస్తున్నారా..? లేక ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారా..? అనే సందేహాలు గ్రామస్తుల్లో వ్యక్తమవుతున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అక్రమ మట్టి దందా కొనసాగుతుందా అనే కోణంలో కూడా విచారణ జరపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రాత్రి వేళల్లో అక్రమ మట్టి రవాణా మరింత పెరుగుతోందని, ఓవర్‌స్పీడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ల వల్ల ప్రమాద భయం నెలకొన్నప్పటికీ ఎలాంటి నియంత్రణ చర్యలు కనిపించడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రాజకీయ నాయకుల అండతోనే మట్టి మాఫియా రెచ్చిపోతోందనే చర్చలు మండల వ్యాప్తంగా జోరుగా సాగుతున్నాయి.అక్రమ తవ్వకాల వల్ల ప్రభుత్వానికి భారీగా ఆదాయ నష్టం వాటిల్లడమే కాకుండా పర్యావరణ సమతుల్యత కూడా దెబ్బతింటోందని ప్రజలు చెబుతున్నారు. రహదారి పక్కనే ఏర్పడిన లోతైన గుంతలు ఎప్పుడైనా ప్రమాదాలకు దారి తీసే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.ఎన్‌హెచ్--980పీ పక్కన మట్టి తవ్వకాలకు అనుమతి ఎవరు ఇచ్చారు..? పర్మిషన్ ఉంటే ప్రజలకు ఎందుకు వెల్లడించడం లేదు.. లేక అక్రమంగానే తవ్వకాలు జరుగుతున్నాయా..?" అంటూ స్థానికులు నిలదీస్తున్నారు.ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ మట్టి తవ్వకాలపై సమగ్ర విచారణ జరిపి, ఇందులో ఎవరి ప్రమేయం ఉన్నా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# దేశవ్యాప్తంగా నీట్ పరీక్షలు రద్దు..!

## -త్వరలో కొత్త షెడ్యూల్ ప్రకటిస్తామన్న ఎన్ టి ఏ,

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మే 12, (విజన్ ఆంధ్ర ప్రతినిధి): నీట్ పరీక్ష పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది, మే 3న దేశవ్యాప్తంగా జరిగిన వైద్య, విద్యా, ప్రవేశ పరీక్షలను రద్దు చేస్తున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించింది. లీకైన పత్రాలకు అసలు ప్రశ్న పత్రంతో పోలికలు ఉండడంతో ఈ నిర్ణ యం తీసుకున్నారు. విద్యార్థులు ఇప్పటికే నీట్ -2026 కోసం చేసిన రిజిస్ట్రేషన్ అలాగే కొనసాగుతుం దని ఎన్ టి ఏ, తెలిపింది. ఎంపిక చేసిన పరీక్ష కేంద్రా ల్లోనే మళ్లీ పరీక్ష నిర్వహించే అవకాశం ఉందని వెల్లడించింది. మళ్లీ కొత్తగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని, అదనంగా ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవస రం కూడా లేదని స్పష్టం చేసింది.

కొత్త పరీక్ష తేదీలు, అడ్మిట్ కార్డ్ వివరాలు అన్నీ కేవలం ఎన్ టి ఏ అధికారిక వెబ్‌సైట్ ద్వారానే ప్రకటిస్తామని పేర్కొంది. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తలు, ఫేక్ మెసేజ్‌లను నమ్మవద్ద ని హెచ్చరించింది. విద్యార్థులు, తల్లిదం డ్రులు కేవలం అధి కారిక సమాచారాన్నే అనుసరించాలని సూచించింది.

# తంగడపల్లిలో భక్తిశ్రద్ధలతో ఆంజనేయ స్వామి జయంతి



చేవెళ్ల,మే 12 (విజన్ ఆంధ్ర) : చేవెళ్ల మండల పరిధిలోని తంగడపల్లి గ్రామం మంగళవారం భక్తి పారవశ్యంతో మునిగిపోయింది. దశావతార సహిత వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో ఆంజనేయ స్వామి జయంతి సందర్భంగా విశేష పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు నడదూర్ వెంకటాచార్యులు స్వామివారికి అభిషేకం, అష్టోత్తర శతనామార్చన, సింధూరార్చన, వడమాల సమర్పణ, మహామంగళహారతి నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. ఆలయ ప్రాంగణం భక్తులతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పామెన రాములు, అర్చకులు శేషాద్రి, వేణు మాధవన్, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష నిర్వహణలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలం

**--తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి.**

**--ప్రశ్నపత్రాల లీకేజీలతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన.**

**--నీట్ పేపర్ లీకేజీకి పూర్తి బాధ్యత వహించి కేంద్ర ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలి**



నీట్ పరీక్ష నిర్వహణలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలం.
--తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి.
--ప్రశ్నపత్రాల లీకేజీలతో విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన.
--నీట్ పేపర్ లీకేజీకి పూర్తి బాధ్యత వహించి కేంద్ర ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలి.

తాండూరు, మే 12 (విజన్ ఆంధ్ర) దేశవ్యాప్తంగా వైద్య విద్య కోసం సిద్ధమవుతున్న లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే నీట్ పరీక్ష నిర్వహణలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. వరుసగా ప్రశ్నపత్రాల లీకేజీలతో, పారదర్శకత లోపించడం వల్ల విద్యార్థులు మరియు తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని పేర్కొన్నారు. పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఎన్నో సంవత్సరాలు కష్టపడి పరీక్షలకు సిద్ధమవుతుంటే, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వారి భవిష్యత్తు అనిశ్చితిలో పడుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తును నిర్మించే యువత జీవితాలతో రా జ కీ య ా లు చేయకుండా, కేంద్ర ప్రభుత్వం వెంటనే పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల నమ్మకాన్ని కాపాడాలంటే నీట్ పరీక్ష వ్యవస్థలో పూర్తి పారదర్శకత, భద్రత, జవాబుదారీతనం తీసుకురావడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

అలాగే సాధ్యమైనంత త్వరగా మళ్లీ నీట్ పరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి. నీట్ పేపర్ లీకేజీకి పూర్తి బాధ్యత వహించి కేంద్ర ప్రభుత్వం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు క్షమాపణలు చెప్పాలని అన్నారు.

# నేడే పాలిసెట్--2026 ప్రవేశ పరీక్ష

**- మంచిర్యాల జిల్లాలో పాలిసెట్ -2026కు ఏర్పాట్లు పూర్తి, కోఆర్డినేటర్ డా. ఎం. దేవేందర్**



బెల్లంపల్లి మే 13 విజన్ ఆంధ్ర : మంచిర్యాల జిల్లా పరిధిలోని బెల్లంపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్ కోఆర్డినేటింగ్ కేంద్రాల్లో పాలిసెట్--2026 ప్రవేశ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని కోఆర్డినేటర్ డా. ఎం. దేవేందర్ తెలిపారు. ఈ నెల 13న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

జిల్లా వ్యాప్తంగా మొత్తం 4,599 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. విద్యార్థులు ఉదయం 10 గంటలలోపు కేంద్రాలకు చేరుకోవాలని, 11 గంటల తర్వాత హాల్లోకి అనుమతి ఉండదని సూచించారు. హాల్ టికెట్‌తో పాటు బ్లూ లేదా బ్లాక్ పెన్, హెచ్‌బీ పెన్సిల్, రబ్బరు వెంట తీసుకురావాలని తెలిపారు.

మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, కాలిక్యులేటర్లు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు పూర్తిగా నిషేధించినట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, పోలీస్ బందోబస్తు, మెడికల్ సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలను మాల్‌ప్రాక్టీస్ రహితంగా నిర్వహించేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్లు, అబ్జర్వర్లు నియమించినట్లు వెల్లడించారు.

# నగర దీపికలకు పెండింగ్ వేతనాలను చెల్లించాలి ఏఐటియుసి

కల్లూరు,మే12(విజన్ ఆంధ్ర) : నగర దీపికలకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ కమీషనర్ రాజశేఖర్ కు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందించారు.

గత 8 నెలలుగా మున్సిపాలిటీ పరిధిలోని ఉన్న నగర దీపికలకు వేతనాలు చెల్లించడం లేదని వేతనాలు లేక కుటుంబ పోషణ ఇబ్బంది కరంగా ఉందని వెంటనే స్పందించి వేతనాలు చెల్లించి ఆదుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ

నూతన మున్సిపాలిటీగా ఏర్పడి నెలలు దాటిన కూడా వేతనాలు అందించకపోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని 8 నెలలుగా



వేతనాలు అందకపోవడంతో నిత్యవసరాలు కొనుగోలుకు జీవనభారం ఇబ్బంది కరంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వం వారికి అందించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని స్వయం సహాయక సంఘాల వారికి ప్రతిరోజు బ్యాంకు రుణాలు స్త్రీ నిధి రుణాలు జీవనోపాదుల కొరకు స్వయం ఉపాధి కొరకు రుణాలను అందించి వారి ఆర్థిక అభివృద్ధికి కుటుంబాభివృద్ధికి ప్రభుత్వం తరఫున సంక్షేమ పథకాలను అందిస్తున్నామని, ప్రభుత్వం ఎనిమిది నెలలు దాటిన కూడా వేతన బకాయిలు చెల్లించడంలో ఆలస్యం నిర్లక్ష్యం వహిస్తుందని పేర్కొన్నారు. కొద్ది రోజుల్లో వేతనాలను చెల్లించనిచో దశల వారి ఆందోళనలకు సిద్ధమవుతామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నగర దీపికలు జొన్నలగడ్డ కుమారి ,రమాదేవి, అనూష ,పుల్లమ్మ, రామలక్ష్మి ,షాహిదా బేగం, రమాదేవి ,పద్మ ,లక్ష్మి, ఫాతిమా, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బాధితురాలికి న్యాయం జరగాలి

## మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యలు



**బండి సంజయ్ కుమారుడి కేసులో బాధితురాలికి న్యాయం జరగాలని నేను నిన్న మాట్లాడిన విషయం స్పష్టం చేస్తున్నాను. నా వ్యాఖ్యలను కొంతమంది వక్రీకరించారు. పొన్నం ప్రభాకర్**

అక్కన్నపేట మే 12 విజన్ ఆంధ్ర : కేంద్ర మంత్రి ధీఱఅఱ ఘఱఅయిఎ ఖఱఘిఖఱ ఈ వ్యవహారంలో విచారణను ఎదుర్కొని తన నిర్దోషిత్వాన్ని నిరూపించుకోవాలని మాత్రమే నేను చెప్పాను. ఈ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ కక్షపూరితంగా తీసుకువెళ్తోందని కొన్ని మున్నూరు కాపు సంఘాలు ఆరోపిస్తున్నాయి. అయితే, బాధితురాలు కూడా అదే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి అన్న విషయాన్ని నేను ప్రస్తావించాను. "మీరు ఏం చేస్తారో చేసుకోండి" అనే ఉద్దేశంతో నేను మాట్లాడలేదు. నా ఉద్దేశ్యం ఒక్కటే – బాధితురాలికి న్యాయం జరగాలి. ఈ విషయంలో ఎలాంటి రాజీ ఉండదు.

బాధితురాలికి Indian National Congress పార్టీ అండగా ఉంటుంది. ఆమెకు పూర్తిస్థాయి మద్దతు ఇస్తాం.

బాధితురాలికి న్యాయం తప్పనిసరిగా జరగాలి. న్యాయం కోసం మేము పోరాడుతాం.

# ఘనంగా శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి అలయ వార్షికోత్సవ వేడుకలు

**- కన్నుల పండుగగా అమ్మవారి కళ్యాణ మహోత్సవం**

గజ్వేల్ నియోజకవర్గం, 12 మే 2026 (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లా కుకునూరు పల్లి మండల కేంద్రంలో గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించి, రేణుక ఎల్లమ్మ తల్లి జమదగ్ని కళ్యాణ మహోత్సవ వేడుకలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు మహా అన్న ప్రసాదం అందజేశారు,ఈ సందర్భంగా గౌడ సంఘం అధ్యక్షుడు నర్సింలు గౌడ్ మాట్లాడుతూ, ఆలయ వార్షికోత్సవ వేడుకలు సహకరించిన ప్రతి ఒక్కరికి అమ్మవారి అనుగ్రహం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లం కనుకవ్వ ఐలయ్య, మాజీ సర్పంచ్ లు కాసం నవీన్, జయంతి నరేందర్, గౌడ సంఘం అధ్యక్షుడు దూరమైన నర్సింలు గౌడ్ ఉపాధ్యక్షుడు పాల శేఖర్ గౌడ్, కోశాధికారి శివలింగ ప్రభాకర్ గౌడ్, కార్యవర్గ సభ్యులు పాల సంతోష్ గౌడ్, మాందాల మహేష్ గౌడ్, సాద్ పల్లి రాజు గౌడ్, కుకునూర్ పల్లి గౌడ సంఘం సభ్యులు, మహిళలు, చిన్నారులు, యువకులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



# "ఒత్తిడిని అధిగమించుటే మానసిక ఆరోగ్యం"

## - డాక్టర్ వినయ్, డాక్టర్ నిఖిత

మహాదేవపూర్ మే 12 (విజన్ ఆంధ్ర ) స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహాదేవపూర్‌లో నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల్లో భాగంగా రెండవ రోజు యోగ మరియు మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెంటల్ హెల్త్ కన్వీనర్ వేముల రమేష్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ జన్ను విజయకుమార్ అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సందర్భంగా డాక్టర్ వినయ్ మరియు డాక్టర్ నిఖిత విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, భావోద్వేగ సమతుల్యతను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కోపం, ఆందోళన, నిరాశ, ఒత్తిడి వంటి సమస్యలను శాంతంగా ఆలోచిస్తూ ఎదుర్కోవాలని సూచించారు. శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడం ద్వారా మానసిక ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చన్నారు.

మానసిక ఆరోగ్య సమస్యల నివారణకు ధ్యానం, యోగా, వ్యాయామం, సరైన నిద్ర, కుటుంబ సభ్యులు మరియు స్నేహితులతో మంచి సంబంధాలు అవసరమని తెలిపారు. అలాగే మొబైల్ ఫోన్, సోషల్ మీడియా వినియోగాన్ని తగ్గించి, మంచి ఆహారపు అలవాట్లు అలవరుచుకోవాలని సూచించారు. మద్యపానం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అవసరమైతే కౌన్సిలర్ సహాయం తీసుకోవాలని




పేర్కొన్నారు.

ప్రశాంతమైన ప్రకృతి వాతావరణంలో సేదతీరడం ద్వారా ఒత్తిడి, భయం, నిద్రలేమి వంటి సమస్యలను అధిగమించవచ్చని వారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం లో రైతులు కష్టాలు

**- ముగ్గురు మంత్రులు ఉన్న రైతులను పట్టించుకునే నాథుడే లేడు**

**- అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చి రైతులను మోసం చేశారు.**

**- మాజీ జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు**

బోనకల్, మే 12( విజన్ ఆంధ్ర) : తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన తరువాత రైతుని రాజు గా చేసిన ఘనత కెసిఆర్ దక్కిందని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు మళ్ళీ కష్టాలు మొదలయ్యాయి అని జడ్పీ మాజీ ఛైర్మన్ బిఆర్ఎస్ పార్టీ మధిర నియోజకవర్గ ఇన్చార్జి శ్రీ లింగాల.కమల్ రాజు ,అన్నారు.బోనకల్లు మండల కేంద్రంలో మంగళవారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులు తో కలిసి నిర్వహించిన రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. గత నెల రోజులుగా రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని ఈ ప్రభుత్వం కనీసం స్పందించడం లేదని విమర్శించారు అనేక అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చి రైతులను మోసం చేశారని ఆరోపించారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక మంత్రులు స్పందించి



రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటిసి బానోత్ కొండ, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పారా ప్రసాద్, వేమూరు ప్రసాద్, బందం నాగేశ్వరరావు, పెనుకొండ ఏడుకొండలు, గద్దల వెంకటేశ్వర్లు, జక్రిపోతుల రవీంద్ర ,బాబు, చావా హనుమంత రావు ,చేపూరి స్వామిదాసు, కాకాని శ్రీనివాస రావు, రామకృష్ణ కేతినేని సత్యనారాయణ గుండపునేని సుధాకర్ రావు, యనమద్ది శ్రీనివాస రావు, తేళ్ళూరి రమేష్ ,నరసింహ రావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# మండుతున్న చికెన్ ధరలు

## సామాన్యులు కొనలేని స్థితిలో చికెన్ ధరలు,

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మే 12,( విజన్ ఆంధ్ర ప్రతినిధి):చికెన్ ధరలు రోజు రోజుకు ప్రియం అవుతున్నాయి,వారం రోజుల నుంచి పరిశీలిస్తే ధరలు క్రమంగా పెరుగుతూ వస్తున్నాయి, ఈనెల 6న, స్కిన్ తో కిలో 260 ఉండగా, ప్రస్తుతం 380 కి చేరింది, దీంతో కోడి మాంసం ప్రియులు చికెన్ కొనాలంటే జంకుతున్నారు. కిలో, రెండు కిలోలు తెచ్చుకుని తినేవారు అరకిలో తో సరిపెట్టు కుంటున్నారు.

మటన్ ధరలు కేజీ ?1000 నుంచి 1100 వరకు పలుకుతుండడంతో, మటన్ ధరలకు చికెన్ ధరలకు చాలా వ్యత్యాసం ఉండడంతో మధ్య తరగతి కుటుంబాలు ఎక్కువ గా చికెన్ ను ఇష్టపడ తారు.ధరలు అందుబాటులో ఉంటాయన్న కారణంతో సామాన్యులు ఎక్కు వగా చికెన్ ను కొను గోలు చేసి తింటారు. ప్రస్తుత కాలంలో తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ధరలు ఆకాశన్నంటుతున్నాయి. ఎండలు. పెళ్లిళ్ల సీజన్ సరఫరా తగ్గుదల, వెరసి చికెన్ ధరలు భారీగా పెరిగాయి.

రోజురోజుకూ చికెన్, మటన్ ధరలు పెరుగు తుండటంతో సామాన్యులు కొనాలా? వద్దా? అన్న పరిస్థితి నెలకొంది. తాజా చికెన్ రేట్ల ప్రకారం.. ఫామ్ రేట్ లైవ్ బర్డ్ (కోడి కిలో) 170 నుంచి 180 ఉ ంది. డ్రెస్డ్ చికెన్ రూ.320 –330 వరకు అమ్ముతున్నా రు.

స్కిన్ లెస్ రూ.360నుంచి రూ.380 వరకు విక్రయిస్తున్నారు. గుడ్లు డజన్ రూ.75 నుంచి 80 వరకు విక్రయిస్తున్నారు. చికెన్ రేట్లు భారీగా పెరగడంతో మాంసం ప్రియులు కోడి మాంసం కొనాలంటే కొనలేని పరిస్థితి నెలకొంది.

ప్రస్తుతం ధరలు జూన్ నెలాఖరు వరకు ఇలానే ఉంటాయని వ్యాపారులు చెబుతు న్నారు.వేసవి తీవ్రత కారణంగా కోళ్ల మరణాలు పెరగడం, ఫారాల్లో ఉత్పత్తి తగ్గడం వల్ల మార్కెట్‌లో సరఫరా తగ్గిందని, మరోవైపు పెళ్లిళ్లు, ఫంక్షన్లు, హోటళ్ల నుంచి డిమాండ్ పెరగడంతో ధరలు ఒక్కసారిగా పెరిగా యని చెబుతున్నారు.

# పరారిలో బండి భగీరత్..?

## కూకట్ పల్లి డీసీపీ రితి రాజ్ నేతృత్వం లో దర్యాప్తు వేగవంతం



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మే 12, (విజన్ ఆంధ్ర ప్రతినిధి):ఫోక్సో కేసులో నింది తుడిగా ఉన్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరత్ ను త్వరలోనే పట్టుకుంటామని, కూకట్ పల్లి డీసీపీ రితిరాజ్, తెలిపారు. ఫోక్సో చట్టం ప్రకారం నిబంధనలకు లోబడి ఈ కేసు దర్యాప్తు జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు.

గత మూడు రోజులు గా భగీరత్, ఆచూకీ లభ్యం కాకపోవడం రాజకీయవర్గాల్లో పెను సంచలనంగా మారిం ది.ఈ కేసు దర్యాప్తును పర్యవేక్షిస్తున్న కూకట్ పల్లి జోన్ డీసీపీ రితిరాజ్ సోమవారం సాయంత్రం పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అధికారులతో కేసు పురోగతిపై సమీ క్షించారు. అనంతరం ఆమె మీడియాకు కీలక వివరాలు వెల్లడించారు.

గత మూడు రోజులు గా భగీరత్ తన మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి పరారిలో ఉన్నట్లు ఆమె వెల్ల డించారు. నిందితుడు ఎవరితో టచ్‌లో ఉన్నాడు, చివరిగా ఏ ప్రాంతంలో ఉన్నాడు అనే కోణంలో అతని కాల్ డేటా రికార్డ్స్ ను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

ఇప్పటికే బాధితురాలి స్టేట్మెంట్ ఒకసారి రికార్డ్ చేశామని, అ యితే కేసులో మరిన్ని ఆధారాలు సేకరించా ల్సి ఉన్నందున మరో సారి ఆమె స్టేట్మెంట్ రికార్డ్ చేస్తామని, రితి రాజ్,తెలిపారు.

## దేశవ్యాప్తంగా నీట్ పరీక్షలు రద్దు..!

### త్వరలో కొత్త షెడ్యూల్ ప్రకటిస్తామన్న ఎన్ టి ఏ,

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మే 12, (విజన్ ఆంధ్ర ప్రతినిధి): నీట్ పరీక్ష పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది, మే 3న దేశవ్యాప్తంగా జరిగిన వైద్య, విద్యా, ప్రవేశ పరీక్షలను రద్దు చేస్తున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రకటించింది. లీకైన పత్రాలకు అసలు ప్రశ్న పత్రంతో పోలికలు ఉండడంతో ఈ నిర్ణ యం తీసుకున్నారు.

విద్యార్థులు ఇప్పటికే నీట్ -2026 కోసం చేసిన రిజిస్ట్రేషన్ అలాగే కొనసాగుతుం దని ఎన్ టి ఏ, తెలిపింది. ఎంపిక చేసిన పరీక్ష కేంద్రా ల్లోనే మళ్లీ పరీక్ష నిర్వహించే అవకాశం ఉందని వెల్లడించింది. మళ్లీ కొత్తగా దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని, అదనంగా ఎటువంటి ఫీజు చెల్లించాల్సిన అవస రం కూడా లేదని స్పష్టం చేసింది.

కొత్త పరీక్ష తేదీలు, అడ్మిట్ కార్డ్ వివరాలు అన్నీ కేవలం ఎన్ టి ఏ అధికారిక వెబ్‌సైట్ ద్వారానే ప్రకటిస్తామని పేర్కొంది. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తలు, ఫేక్ మెసేజ్‌లను నమ్మవద్ద ని హెచ్చరించింది. విద్యార్థులు, తల్లిదం డ్రులు కేవలం అధి కారిక సమాచారాన్నే అనుసరించాలని సూచించింది.

# ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

## పోలీస్, మున్సిపల్ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక ట్రాఫిక్ క్రియలెన్స్ కార్యక్రమం



హుస్నాబాద్ విజన్ ఆంధ్ర మే 12 : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో ప్రజలకు, వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సోమవారం రోజున పోలీసు శాఖ మరియు మున్సిపల్ శాఖ అధికారులు, సిబ్బంది సంయుక్తంగా ప్రత్యేక ట్రాఫిక్ క్లియరెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించినారు.ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి మల్లెచెట్టు చౌరస్తా వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా బార్డర్లు ఏర్పాటు చేసి, ద్విచక్ర వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలను గుర్తించారు.అలాగే దుకాణాల ముందు పరిశుభ్రత పాటిస్తూ సుద్దతో బార్డర్ వేశారు.అదేవిధంగా అంబేద్కర్ చౌరస్తా నుంచి నాగారం రోడ్డువరకు కూడా రహదారికి ఇరువైపులా గీతలు గీసి, ఆ బార్డర్ దాటి వాహనాలు నిలపకుండా దుకాణదారులు, వ్యాపారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు.ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.ముఖ్యంగా రోడ్లపై అక్రమంగా వాహనాలు పార్కింగ్ చేయరాదని,దుకాణాల ముందు వస్తువులు రోడ్డుపై పెట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించరాదన్నారు.హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపవద్దని,మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు.నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని,ఫుట్‌పాత్‌లు, రోడ్డు ప్రక్కలను కార్లు,ద్విచక్రవాహనాలు ఆక్రమించరాదన్నారు.

అతివేగంగా వాహనాలు నడపడం, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం నిషేధం.

ట్రాఫిక్ నియమాలను పాటించి పోలీసు శాఖకు సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.నిబంధనలు అతిక్రమిస్తే దుకాణ యజమానులకు నోటీసులు జారీ చేసి టౌన్ న్యూసెన్స్ యాక్టు ద్వారా కేసులు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ కే. శ్రీనివాస్ , మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ గౌడ్, స్థానిక ఎస్సై పాకాల లక్ష్మారెడ్డి ట్రాఫిక్ ఎస్ఐ వెంకటేశ్వర్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నర్సుల సేవలు వెలకట్టలేనివి : డాక్టర్ అన్నపూర్ణ గజ్వేల్ డిస్ట్రిక్ట్ హాస్పిటల్ సూపరింటెండెంట్.

## - గజ్వేల్ జిల్లా ఆసుపత్రిలో ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

గజ్వేల్, 12 మే 2026 (విజన్ ఆంధ్ర) : సిద్దిపేట జిల్లా గజ్వేల్ కేంద్ర జిల్లా ఆసుపత్రి నందు మంగళవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని (వరల్డ్ నర్సెస్ డే) పురస్కరించుకొని నర్సులను ఘనంగా సన్మానించారు. ఈ వేడుకలకు జిల్లా కేంద్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ ముఖ్యఅతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ సమాజంలో నర్సుల సేవలు అనన్యసామాన్యమని కొనియాడారు. ఒక అమ్మగా, అక్కగా, చెల్లిగా రోగులకు తోడూంటూ.. రేయింబవళ్లు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా, నిస్వార్థంగా, అంకితభావంతో సేవలు అందించడం చిరస్మరణీయం అని, నర్సుల ఆత్మస్థైర్యం, వారు చూపే ప్రేమ రోగుల త్వరితగతిన కోలుకోవడానికి ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. అనంతరం ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న నర్సింగ్ సిబ్బందిని శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపి కేకు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులు డాక్టర్ కుమార్ స్వామి సహకారంతో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాతా శిశు సంరక్షణ కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ సుశీల రత్నం, ఆర్.ఎం.ఓలు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రణీత, డాక్టర్ త్రివేణి డాక్టర్ సుమన్, నర్సింగ్ సూపరింటెండెంట్ సువర్ణ, హెడ్ నర్సులు ఉమా, రోజులిన్, ఉమామహేశ్వరి, వకుళాదేవి, నిర్మల, పుష్ప, నర్సింగ్ ఆఫీసర్లు షబానా, సప్న, షాహిని, కవిత, ఉజ్మ, రేఖ, ఇన్ఫెక్షన్ కంట్రోల్ నర్సింగ్ ఆఫీసర్ మెహరాజ్ భాను, రజిత, నర్సింగ్ ఆఫీసర్ పుష్ప జగదాంబ, నజీర్, సానిటరీ ఇన్స్పెక్టర్ లక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ రచన, జీవన, ఎక్స్రే టెక్నీషియన్లు అయేషా, మమత, ఈసీజీ టెక్నీషియన్ రాజు, ఆరోగ్యశ్రీ సిబ్బంది సురేందర్, సంతోష్, పారామెడికల్, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.





# ధాన్యం తరలింపునకు లారీలను సిద్ధం చేయాలి

**- గంజాల్ టోల్‌ప్లాజా వద్ద కలెక్టర్ భవేశ్ మిశ్రా తనిఖీ**

రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశం నిర్మల్ జిల్లా, మే12,(విజన్ ఆంధ్రా); జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న వరి, మొక్కజొన్న ధాన్యాన్ని సకాలంలో మిల్లులకు తరలించేందుకు అవసరమైన లారీలను సమకూర్చుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం సోన్ మండలం గంజాల్ టోల్‌ప్లాజా వద్ద లారీల సేకరణ ప్రక్రియను ఆయన పరిశీలించారు.

టోల్‌ప్లాజా మీదుగా వెళ్తున్న ఖాళీ లారీలను గుర్తించి, వాటిని ధాన్యం రవాణాకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లారీ డ్రైవర్లు, యజమానులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి ప్రస్తుత పరిస్థితిని వివరించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పెరగకుండా వెంటనే వాహనాలను అందుబాటులోకి తేవాలని ఆదేశించారు.

అనంతరం మామడ మండలం న్యూ సాంగ్వి గ్రామ రహదారి వద్ద లారీల సేకరణ తీరును పరిశీలించిన కలెక్టర్, సిబ్బందికి పలు సూచనలు చేశారు. లారీల సేకరణ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగేందుకు షిఫ్టుల వారీగా సిబ్బందిని నియమించాలని తెలిపారు. విధుల్లో ఉన్న సిబ్బందికి టెంట్లు, కుర్చీలు, త్రాగునీరు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

వాహనాలను ఆపిన వెంటనే సంబంధిత అధికారుల సమన్వయంతో అవసరమున్న కొనుగోలు కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు పండించిన పంటను రక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ధాన్యం రవాణాలో ఎలాంటి జాప్యాన్నీ సహించబోమని కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, తహసీల్దార్లు సంతోష్, సరిత, శ్రీనివాస్, రెవెన్యూ, రవాణా, పోలీసు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

**- ప్రెస్ క్లబ్ లో అర్బన్ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు..**

నిజామాబాద్ మే12:( విజన్ ఆంధ్ర) జర్నలిస్టుల సమస్యలను ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. ఎమ్మెల్యే పుట్టినరోజును పురస్కరించుకొని మంగళవారం నిజామాబాద్ ప్రెస్ క్లబ్ లో జర్నలిస్టులు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు సంబంధించి ఇప్పటికే అసెంబ్లీలో కూడా ప్రస్తావించడం జరిగిందని గుర్తు చేశారు. తన పుట్టినరోజును పురస్కరించుకొని ప్రెస్ క్లబ్ కమిటీ వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అందరి సంక్షేమం కోసమే తన తాపత్రయమని చెప్పారు. భవిష్యత్తులో జర్నలిస్టుల సంక్షేమం కొరకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం మీడియా ప్రతినిధులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పంచరెడ్డి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి సుభాష్ వాగ్మారే, కోశాధికారి రాజ్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి. రాజు, నిజామాబాద్ ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు, సీనియర్ జర్నలిస్టు, బ్యూరోలు,



స్టాఫ్ రిపోర్టర్లు, వీడియో జర్నలిస్టులు, ఫోటో జర్నలిస్టులు, డెస్క్ జర్నలిస్టులు, ఎడిటర్లు, సబ్ ఎడిటర్లు, ఉర్దూ జర్నలిస్టులు, నగర జర్నలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

# వేసవి శిబిరాలతో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెరుగుతాయి

## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

నిర్మల్ జిల్లా, మే 12,(విజన్ ఆంధ్రా); వేసవి శిబిరాలతో విద్యార్థుల్లో నైపుణ్యాలు పెరుగుతాయని జిల్లా కలెక్టర్ కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు.

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మంగళవారం, పట్టణంలోని జుమ్మెరాత్ పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరాన్ని సందర్శించారు.

ఈ సందర్భంగా కలెక్టర్, పిల్లలతో ముచ్చటించి వారి వివరాలు, జీవిత లక్ష్యాలు ఏంటో అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు సమ్మర్ క్యాంప్ కి రావాలని చెప్పారు. సమ్మర్ క్యాంపులో ఆటలు, పాటలు, యోగ, డ్యాన్స్, ఇతర అంశాల్లో శిక్షణ ఇస్తారని వివరించారు. పిల్లలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు. వేసవి శిబిరాలతో పిల్లల నైపుణ్యాల పెరుగుదలతో పాటు, వారిలో దాగి ఉన్న ప్రతిభ బయట పడుతుందన్నారు.

ఉపాధ్యాయులు, శిక్షకులు, వేసవి శిబిరాలకు వచ్చే విద్యార్థులకు అన్ని విషయాలు చక్కగా నేర్పించాలని వివరించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.

పదవ తరగతి పరీక్షల్లో అనుత్తీర్ణులైన విద్యార్థులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ, అందరూ



ఖచ్చితంగా ఉత్తీర్ణత సాధిస్తారని, అధైర్య పడవద్దని ప్రోత్సహించారు. ఆయా సబ్జెక్టులు శ్రద్ధగా చదువుకొని ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఎటువంటి సందేహాలు ఉన్న ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయులతో మాట్లాడుతూ, విద్యార్థులందరూ ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని అన్నారు. వారి భయాలు, సందేహాలు తొలగించి, వారిని ప్రోత్సహించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిఈఓ భోజన్న, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలుగకూడదు

## –రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి

నిర్మల్ జిల్లా, మే 12,(విజన్ ఆంధ్రా); మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

మంగళవారం, సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్రంలో వరి, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియపై పలువురు మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, తదితర ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాదు నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, మొక్కజొన్న, వరి పంటల కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. హమాలీలు, గన్ని సంచులు, ధాన్యం తరలింపునకు లారీలు, ధాన్యం నిల్వ చేయడానికి తగిన స్థలాల కొరత లేకుండా చూడాలన్నారు. ధాన్యం సరఫరాకు అవసరమైతే లారీలతో పాటుగా ట్రాక్టర్లను కూడా వినియోగించుకోవాలన్నారు. ధాన్యం తరలింపుకు సంబంధించి లారీల



కాంట్రాక్టర్లు అలసత్వం వహిస్తే వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధాన్యం లోడింగ్, అన్ లోడింగ్ ప్రక్రియకు అవసరమైతే స్థానిక హమాలీలను నియమించుకోవాలని పేర్కొన్నారు. రైతుల నుంచి ధాన్యం సేకరించిన వెంటనే వారికి రశీదులు ఇవ్వాలన్నారు. అకాల వర్షాల వల్ల రైతులు తమ పంటలు నష్టపోకుండా చూడాలన్నారు. వాతావరణ సమాచారం ఎప్పటికప్పుడు రైతులకు చేరవేసేలా తగు చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్లందరూ ధాన్యం కొనుగోలు ప్రక్రియను స్వయంగా పర్యవేక్షిస్తూ ఉండాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలిగితే ఎట్టిపరిస్థితుల్లో సహించేది లేదని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నుంచి ఈ వీసీలో పాల్గొన్నారు.

వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మొక్కజొన్న, వరి పంటల కొనుగోలు సాఫీగా పూర్తి చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో వేగం పెంచాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి అన్లోడింగ్ పాయింట్ లు దగ్గర్లో ఉంటే ట్రాక్టర్ల ద్వారా ధాన్యం సంచులు తరలించే విధంగా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సంచులు నిల్వ ఉంచరాదని పేర్కొన్నారు. ధాన్యం తూకం, తరలింపులో ఎట్టి పరిస్థితుల్లో రైతుల నుంచి డబ్బులు వసూలు చేయరాదని హెచ్చరించారు.

ఈ వీసీ లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, పౌర సరఫరాల అధికారి, మేనేజర్ లు రాజేందర్, సుధాకర్, డిఎం మార్క్ ఫెడ్ మహేష్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, డిఆర్డిఓ విజయలక్ష్మి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## బండి సంజయ్ కుమారుడిని అరెస్ట్ చేయాలి

### చర్లలో బీఆర్ఎస్ ధర్నా



చర్ల, మే 12 (విజన్ ఆంధ్ర): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ చర్ల మండల బీఆర్ఎస్ కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు.
ఈ సందర్భంగా మండల కన్వీనర్ దొడ్డి తాతారావు మాట్లాడుతూ, మైనర్ బాలికకు న్యాయం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. సామాన్యులకు ఒక నీతి, మంత్రి కొడుక్కి మరో నీతా అని ప్రశ్నించారు. బాధితురాలి కుటుంబానికి అండగా ఉండాల్సింది పోయి, వారిని వేధించడం దారుణమన్నారు. "బేటీ బచావో – బేటీ పడావో" అని చెప్పే బీజేపీ నాయకత్వం ఈ విషయంలో ఎందుకు మౌనంగా ఉందని నిలదీశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎస్.డి. అజీజ్, కాకి అనిల్, తడికల బుల్లబ్బాయి, రాంబాబు, సతీష్, నర్సవేణి, అంబోజు సతీష్, మరియు ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముధోల్ లో పోలేరమ్మ పండుగ

ముధోల్: 12మే:విజన్ ఆంధ్ర. ముధోల్ మండల కేంద్రమైన ముధోల్ లో ఆయా కులసంఘాల ఆధ్వర్యంలో భక్తులునెత్తిన దొంతులు(కుండ)లను ఎత్తుకొని ,మహిళలు మంగళ హారతులతో గ్రామంలోని ఆయా విధుల గుండా భజంత్రీలతో ఊరేగింపుగా ఆలయానికి బయలుదేరారు.ఆలయానికి చేరుకొని అమ్మవారికి వండుకొని తీసుకువచ్చిన నైవేద్యాలను సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. ఈ యేడు వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు పుష్కలంగా ఉండాలని కోరుకున్నారు. పోలేరమ్మ పండుగా సందర్భంగా గ్రామంలో భక్తులతో పండుగ వాతావరణం నెలకొంది.

## ఒక బీసీ నాయకుని ఎదుగుదలను చూసి ఓర్వలేక ఉద్దేశపూర్వకంగా సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేస్తున్నారు---



ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ ఎద్దేవా అదిలాబాద్ జిల్లా ప్రతినిధి, మే 12, (విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ క్యాంప్ ఆఫీస్ లో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... బిజెపి ఎదుగుదలను చూసి ఓర్వలేక, పశ్చిమ బెంగాల్ బిజెపి ఖాతాలో పడిపోయిందని, తెలంగాణలో బిజెపి జెండా ఎగరడం ఖాయమని రాష్ట్ర మొత్తం చర్చ జరుగుతుంది ఈ సందర్భంలో బండి సంజయ్ కుమారుని వంకతో ఒక కార్యకర్త స్థాయి నుండి కేంద్ర సహాయ మంత్రిగా ఒక బీసీ నాయకుడు ఎదగడం జీర్ణించుకోలేక కొందరు సోషల్ మీడియా ద్వారా బిజెపిని ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని... సిట్ నువ్వు ఏర్పాటు చేశారు కాబట్టి సిట్ ముందర బండి సంజయ్ కుమారుడు ఏం చెప్పకముందే వాస్తవాలు రాకముందే సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తుందని, బిజెపి ఎప్పుడూ మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యం మిస్తుందని మహిళా బిల్లు వీగిపోవడానికి ఏ రాజకీయ పార్టీలు నిలబడ్డాయో అవి రాజకీయ పార్టీలు రచ్చ చేస్తున్నాయి అని... వాస్తవాలు బయటకు వచ్చేవరకు సోషల్ మీడియాలో ఎలాంటి తప్పుడు ప్రచారాలు చేయవద్దని ఎమ్మెల్యే పాయల శంకర్ హితువు పలికారు.

## తాంసి జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఏ.యం.సి. చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి

ఆదిలాబాద్ జిల్లా ప్రతినిధి, మే 12, ( విజన్ ఆంధ్ర) ఆదిలాబాద్ జిల్లా తాంసి మండల కేంద్రంలోని తెల్ల జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి జొన్నలతో పాటు ఇతర ఏ పంటలు సాగు చేశారో అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది పంట దిగుబడి ఎలా ఉందని, ఇటీవల కురిసిన అకాల వర్షాల ప్రభావం ఏమైనా ఉందా అని రైతులను ప్రశ్నించారు. అనంతరం రైతులు షెడ్యూల్ ప్రకారం ధాన్యాన్ని మార్కెట్ యార్డుకు తీసుకురావాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తనను సంప్రదించాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జొన్న కొనుగోళు చేపట్టాలని మార్కెట్ సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో



మార్కెట్ కమిటీ సభ్యులు, పలువురు నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సర్కార్ మాది.. ఏదైనా చేస్తాం..

### మాజీ కార్పొరేటర్ భర్త ఆగడాలు
### ఏ పార్టీ అధికారంలో ఉంటే అటు కప్పదాటుడే..
### కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్న బాధితుడు.....
### స్టే ఉన్నా చకచకా అతని నిర్మాణ పనులు
### ఆది నుంచి అతని రూటే సపరేటు

బోడుప్పల్,మే 12( విజన్ ఆంధ్ర) : ఆయనో మాజీ కార్పొరేటర్ భర్త.. గత ప్రభుత్వంలో మొదలైన ఆయన ఆగడాలు..ఇప్పటి ప్రభుత్వంలోనూ కొనసాగుతున్నాయి. బీఅర్ఎస్ కార్పోరేటర్‌గా ఉన్న ఆయనకు ప్రభుత్వం మారగానే మళ్లీ అధికార పార్టీలో వచ్చి యాదావిధిగా నిర్మాణం చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.అధికారంలో ఉన్నాం.. రాష్ట్రం నుంచి కార్పొరేషన్ వరకు అంతా
మాదే హవా.. మాకేదీ అడ్డుండదు.. మా మాటే శాసనం.. మేం చెప్పిందే న్యాయం.. అంటూ అధికార
పార్టీకి చెందిన ఓ మాజీ కార్పొరేటర్ భర్త భాదితుడికి చేసిన ఉపోద్ఘాతం. వివరాల్లోకి వెళితే.. బోగస్
డాక్యుమెంట్ లతో గతంలో ఉన్న ఫీర్జాదిగూడ 3వ డివిజన్ మాజీ కార్పొరేటర్ భర్త తన ప్లాటులో పాగా వేసి దర్జా ఇంటి నిర్మాణం చేస్తూ తనపైనే దౌర్జన్యానికి
పాల్పడుతూ చంపేస్తానంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ బాధితుడి ఆవేదన ఇది..మేడిపల్లి మండలం పర్వతాపూర్ గ్రామ పరిధిలో కొనసాగుతున్న భూ వివాదం మరోసారి చర్చనీయాంశంగా మారింది. మంగళవారం బాధితుడు శ్రీనివాస్ రెడ్డి సత్యనారాయణపురం కాలనీలో నిర్మాణం జరుగుతున్న ఇంటి వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాజీ కార్పొరేటర్ భర్త బి. ఈశ్వర్ రెడ్డి పేరు ప్రతివాదుల జాబితాలో ఉండగా ఉప్పల్‌లోని రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కమ్ ఆరో అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు కీలక మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఓఎస్ నెం. 40/2024కు సంబంధించి దాఖలైన ఐఏ నెం.189/2024 పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు, ఏప్రిల్ 29, 2026న ఉత్తర్వులు వెలువరించింది. కోర్టు ఆదేశాల ప్రకారం ప్రతివాదిగా ఉన్న బి.ఈశ్వర్ రెడ్డి, ఇతరులు సంబంధిత భూములపై ఎలాంటి విక్రయాలు, బదిలీలు, మూడో వ్యక్తులకు హక్కుల కల్పన లేదా ఎంకంబరెన్సులు సష్టించే చర్యలు చేపట్టరాదని స్పష్టం చేసింది. అలాగే వివాదాస్పద ఆస్తిలో కొత్త నిర్మాణాలు, డెవలప్‌మెంట్ కార్యకలాపాలు చేపట్టకుండా ఉండాలని, అవసరమైన నిర్వహణ పనులు మాత్రమే నిర్వహించవచ్చని కోర్టు పేర్కొంది. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి జరిగే ఏ లావాదేవీలైనా కేసు తుది తీర్పుకు లోబడి ఉంటాయని కూడా స్పష్టం చేసింది.అయితే ఈ వ్యవహారానికి సంబంధించిన ఆ సదరు భూమిని 2004లో శ్రీనివాస్‌రెడ్డి కొనుగోలు చేశారు. మాజీ కార్పొరేటర్ భర్త ఈశ్వర్‌రెడ్డి తన ప్లాటును ఆక్రమించాడని అరోపించాడు. 2023లో ఈశ్వర్‌రెడ్డి ఆక్రమించి 320 గజాల్లో అపార్ట్‌మెంట్ నిర్మాణం మొదలు పెట్టాడు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన శ్రీనివాస్‌రెడ్డిపై బెదిరింపులు మొదలు పెట్టాడు. దీంతో 2024 శ్రీనివాస్‌రెడ్డి కోర్టును ఆశ్రయించాడు. దీంతో ఆ నిర్మాణాలను నిలుపుచేయాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. అలాగే హెచ్ఎండీఏ సైతం డబుల్ అయినందున కింది కోర్టులో చూసుకోవాలని చెప్పగా దీంతో ఉప్పల్ మేజిస్ట్రేట్ కోర్టులో తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఎక్కడి పనులు అక్కడే నిలిపివేయాలని ఆదేశించింది. ఆ ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ అధికారులను సైతం బెదిరిస్తూ పనులను చకచకా పూర్తి చేస్తూ వస్తున్నారు. దీనిపై శ్రీనివాస్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్‌కు,డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అయినా ఫలితం లేకపోయింది. అటు కోర్టు ఉత్తర్వులను, ఇటు మున్సిపల్ అధికారుల ఆదేశాలను పట్టించుకోకుండా,బెదిరింపులకు గురి చేస్తూ నిర్మాణాన్ని పూర్తి చేస్తూ వస్తున్నారు.దీనిపై నారాపల్లి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో నిషేధిత జాబితాలో చేర్చారు.ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోని పనులు అపివేయాలని శ్రీనివాస్‌రెడ్డి కోరారు.ఈ విషయమై టౌన్ ప్లానింగ్ అధికారులను వివరణ కోరగా కోర్టు ఉత్తర్వులు పత్రాలను అందించాడని, పత్రాలను పరిశీలించి వాటిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

